మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

రోడ్డు ప్రమాదాల నివారణకు..

# పటిష్టమైన చర్యలు చేపట్టాలి

**● నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి, మార్చి 18 ప్రభాతవార్త:** జిల్లాలోని జాతీయ రహదారి, రాష్ట్ర రహదారి,మున్సిపాలిటీల్లో రోడ్డు ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం కలెక్టరేట్ విడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి రోడ్డు భద్రత సమన్వయ కమిటి సమావేశానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు లైన్ డిపార్టుమెంట్‌లతో జిల్లాస్థాయి రోడ్డు భద్రత సమన్వయ కమిటి ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందులో జిల్లా ఎస్పీతో పాటు వైద్య ఆరోగ్యశాఖ, జాతీయ రహదారుల కార్య నిర్వాహక ఇంజనీరు, రోడ్లు భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజనీరు, పంచాయతీరాజ్, ఆర్‌టిఓ, డిఎం,ఆర్టీసి, మున్సిపల్ కమిషనర్లు మెంబర్ సెక్రెటరీలు, సభ్యులుగా ఉంటారన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు ఆయాలైన్ డిపార్టుమెంట్‌లు తమవంతు బాధ్యతలు నిర్వర్తించి చేపట్టిన పనుల నివేదికనుఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. 2014 నుండి 2022 వరకు నారాయణపేట జిల్లాలో రోడ్డు ప్రమాదాల వల్ల 650 మంది ప్రాణాలు కోల్పోయారని 1205 మంది గాయాలపాలయ్యారన్నారు. ముఖ్యంగా కృష్ణ, మాగనూరు, మక్తల్ ఏరియాలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగినట్లు తెలియజేశారు. 2022 సంవత్సరంలో 28 మంది రోడ్డు ప్రమాదంలో మరణించగా 37మంది గాయపడినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి.ఈ సంవత్సరం ఇప్పటివరకు ప్రమాదాల సంఖ్య పెరుగుతూనే ఉందని దీనిని తక్షణమే అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం పోలీస్‌శాఖ, రోడ్లు, భవనాలు, జాతీయ రహదారులు, మున్సిపల్ కమిషనర్లు సంయుక్తంగా రోడ్లను పర్యవేక్షించి అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం, సైన్ బోర్డులు, రేడియం సూచికలు ఇరుకైన వంతెనల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం వంటివి నెల రోజుల్లోపూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్లపై ఉన్న గుంతలను తక్షణమే పూడ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శక్తినగర్ నుండి డస్ట్‌లోడ్‌తో నింపిన భారీ వాహనాలు వస్తున్నాయని వాటిలో అధిక లోడ్‌తో లేకుండా పైన కవర్ కప్పేసి ఉండే విధంగా చూడాలని ఆర్టీఓను ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. మున్సిపాలిటీలలో ఉన్నరోడ్లపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించడం వంటివి త్వరగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో జాతయ రహదారి 167 మరికల్ నుండి 56 కి.మీ.,యాదగిరి జాతీయ రహదారి 12 కి.మీ. మిగిలిన రాష్ట్ర రహదారులు, ఆర్‌అండ్‌బి రోడ్లు ఉన్నాయని వీటిపై ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు పోలీస్ శాఖ తరపున కళాజాత బృందాల ద్వారా అవగాహన కల్పించడం, షీటీంల ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అధిక వేగంతో ప్రయాణించే వాహనాలను గుర్తించి పెనాల్టీలు వేయడం జరుగుతుందన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపటం,ముగ్గురు ప్రయాణించడం, డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ పిల్లలు వాహనాలు నడపటం, మత్తు పానీయాలు సేవించి వాహనాలు నడపటం వంటివి అరికట్టేందుకు ఇకనుండి మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు మహబూబ్‌నగర్ లేదా హైదరాబాద్ తీసుకువెళ్లడం జరుగుతుందని, అప్పటికే ఆలస్యం కావడంతో ప్రాణాలుకోల్పోతున్నట్లు తమనివేదికలో గుర్తించడం జరిగిందన్నారు. అందువల్ల క్షతగాత్రులకు మెరుగైన వైద్యం నారాయణపేటలోనే జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. జాతీయ రహదారిపై పాడైన వాహనాలను నిలపడం వల్ల వాటికి రెడ్‌స్నిగల్ లేదా ఇతర గుర్తించడానికి వీలుగా ఏ గుర్తులు లేకపోవడం వల్ల వెనకవైపు నుండి వచ్చే వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయని అలాంటి వాటిని గుర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని జాతీయ రహదారి అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్య అధికారి డా.రాంమనోహర్, ఆర్‌అండ్‌బి ఈఈ కెవిఎన్ స్వామి,డిఈ రాములు, జాతీయ రహదారుల డిఈ రమేష్, డీఎస్పీ సత్యనారాయణ, ఈఈ పిఆర్ నరెందర్, మున్సిపల్ కమిషనర్లు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, డిఎం, ఆర్టీసి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా విజయవంతమైన..

## తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం



తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 18 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా శనివారం అన్ని ప్రభుత్వ మరియు స్థానిక సంస్థల పాఠశాలల్లో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని 825 పాఠశాలలకు గాను 740 పాఠశాలల్లో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. 825 పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు 72,224 మంది విద్యార్థులు విద్యాబుద్ధులు నేర్చుకుంటున్నారు. తల్లిదండ్రుల సమావేశానికి 38,556 మంది హజరైనట్లు జిల్లా అకాడమి మానిటరింగ్‌అధికారి బరుపటి వెంకటయ్య తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు, ముగ్గురు పిల్లలు పలు పాఠశాలల్లో చదువుతున్నారని విద్యాశాఖ అధికారులు తెలిపారు. పిల్లల క్రమశిక్షణ, అటెండెన్స్, పాఠశాలలో రోజు చెప్పిన పాఠాలు, ఇతర విశేషాల గురించి తల్లిదండ్రులు వారి పిల్లలను తెలుసుకున్నారు. విద్యార్థులను ప్రతి రోజు పాఠశాలలకు పంపించాలని ఉపాధ్యాయులు సూచించారు. జిల్లాలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశాలు విజయవంతమైనట్లు డీఈఓ గోవిందరాజులు పేర్కొన్నారు. జిల్లాలోని పాఠశాలల్లో నిర్వహించిన తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశాలు నివేధికలను డాక్యుమెంటేషన్ ద్వారా రాష్ట్ర స్థాయి అధికారులకు పంపించి చర్చించిన అంశాల వారిగా వచ్చే అకా డమిక్ ఈయర్‌లో తల్లిదండ్రుల సూచనలు తీసుకుంటామని డీఈఓ తెలిపారు.

## ఎర్రవల్లి కొత్త మండల ఏర్పాటుకు కృషి చేస్తా

**● ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి**



ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డిని సన్మానించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు

**ఇటిక్యాల,మార్చి 18 ప్రభాతవార్త:** దినదినానికి అభివృద్ధి చెందుతున్న ఎర్రవల్లి చౌరస్తా గ్రామ పంచాయతీని మండల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు అన్ని అవకాశాలు ఉన్నాయని ఇప్పటికే 14 గ్రామ పంచాయతీలు తీర్మాణాలు ఇచ్చాయని ఎర్రవల్లి పంచాయతీని కొత్త మండలంగా ఏర్పాటు చేయించేలా చూడాలని నూతన ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డిని ఎర్రవల్లికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాగన్న, పెద్దలక్ష్మన్న, రాముడు తదితరులు కలిసి కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి ఎర్రవల్లి చౌరస్తాను కొత్త మండలంగా చేయించేందుకు కృషి చేస్తానని మండల ఏర్పాటుకు ప్రభుత్వం దృష్టిలో కూడ ఉందని మరోసారి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి మండల ఏర్పాటుకు కృషి చేస్తానని వారికి ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేల కోటాకింద ఏకగ్రీవంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన చల్లా శనివారం మండల పరిధిలోని బీచుపల్లి ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు రాగా ఈ సందర్భంగా ఎర్రవల్లికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాగన్న, పెద్దలక్ష్మన్న, రాముడు తదితరులు ఎమ్మెల్సీ చల్లావెంకటరామిరెడ్డిని శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి,నారాయణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను గాలికొదిలేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు




హాత్ సే హాత్ జోడో పాదయాత్రలో మాజీ మంత్రి డాక్టర్ జి.చిన్నారెడ్డి

**పెద్దమందడి,మార్చి 18 ప్రభాతవార్త:** హాత్ సే హాత్ జోడో పాదయాత్ర శనివారం మండల పరిధిలోని జంగమయ్యపల్లి, బలిజపల్లి, పామిరెడ్డి పల్లి తండాలు, వీరయ్యపల్లి గ్రామాల్లో మండల అధ్యక్షుని ఆధ్వర్యంలో మాజీ మంత్రి, పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మెన్ డా.జి.చిన్నారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు సంస్థలకు అమ్మడం జరుగుతుందని అన్నారు. పెట్రోల్, డీజీల్, సిలిండర్ రేట్లను విపరీతంగా పెంచాడని ఆయన విమర్శించారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500 సిలిండర్ అందిస్తామని ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని,వరి పంటకు రూ.2500 గిట్టుబాటు ధర కల్పిస్తామని ఆయన తెలిపారు. ఇది వరకు మిషన్ భగీరథ పైపులు లీకేజీ అయ్యేవని ఇప్పుడు పరీక్ష పేపర్లు లీకేజీ అవుతున్నాయని ఆయన ఎద్దేవ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కార్యకర్తలు గట్టిగా కష్టపడాలని కోరారు. ఆయా గ్రామాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, పెద్దమందడి మండల అధ్యక్షుడు పెంటన్న యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు జి.మన్యం, జిల్లా ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు రోహిత్, మండల యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, శ్రీరంగాపూర్ పట్టణ అధ్యక్షుడు కె.గోవిందుచ ఎంపీటీసీ ఎల్లస్వామి, మండల వికలాంగుల సెల్ అధ్యక్షుడు రమేష్ గౌడ్, మండల సోషల్‌మీడియా కోఆర్డినేటర్ జి.రాజు, పురుషోత్తం, స్వామి, కె.రఘు, బాలచంద్రి, ఉపసర్పంచ్ నరేందర్ గౌడ్, బి.బాలరాజు, బుచ్చిరెడ్డి, నరసింహ, ఎండి సహుకత్, పార్టీ కార్యకర్తలు, ఆయా గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## టీఎస్‌పీఎస్ చైర్మన్‌ను సస్పెండ్ చేయాలి

**- జాతీయ ఓబీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి**




**కల్వకుర్తి, మార్చి 18 ప్రభాతవార్త:** కేసీఆర్ కుటుంబ సభ్యుల కనుసన్నల్లో టీఎస్‌పీఎస్‌సీ కొనసాగుతుందని, టీఎస్‌పీఎస్ చైర్మన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని జాతీయ ఓబీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి పేర్కొన్నారు. శనివారం కల్వకుర్తి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోజాతీయ ఓబీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి మాట్లాడుతూ పేపర్ లీకేజీకి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని, చరిత్రలో అత్యంత దయనీయ పరిస్థితుల్లో తెలంగాణ నిరుద్యోగులు ఉన్నారన్నారు. టీఎస్‌పీఎస్సీ రద్దు చేసిన పరీక్షలు రాసిన నిరుద్యోగులకు రూ.1లక్ష నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కుటుంబ సభ్యులే పేపర్ లీకేజీకి ప్రధాన కారకులని, లీకేజీ వ్యవహారంలో బీజేపీ పాత్ర ఉందని చెప్పడం కేటీఆర్‌కు సిగ్గుందా అని మండిపడ్డారు. పేపర్ లీకేజీ నిందితులను వెంటనే శిక్షించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు దుర్గప్రసాద్, కృష్ణగౌడ్, రాఘవేందర్‌గౌడ్, రాజేందర్, బోడ నర్సింహ్మ తదితరులు ఉన్నారు.

## విద్యార్థుల దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**● విద్యార్థుల స్కాలర్‌షిప్‌కు అవసరమయ్యే కులం, ఆదాయం సర్టిఫికెట్లు పెండింగ్ ఉంచకుండా సత్వరమే జారీ చేయాలి : గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి**



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

**గద్వాల ప్రతినిధి,మార్చి 18 ప్రభాతవార్త:** జిల్లాలో షెడ్యూల్డు కులాల విద్యార్థినీ, విద్యార్థులు కులం, ఆదాయం సర్టిఫికెట్ల కోసము మీసేవ ద్వారా ఆన్‌లైన్‌లో చేసిన స్కాలర్‌షిప్ దరఖాస్తులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే జారీ చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తహసిల్దార్‌లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ హాలులో అన్ని మండలాల తహసిల్దార్లు, ఎంఈఓలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ షెడ్యూల్డు కులాల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌కు అవసరమయ్యే కులం, ఆదాయం సర్టిఫికెట్లు ఈనెల 31 వరకు జారీ చేయాలని ఆదేశించారు. ఏ మండలం నుండి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి, ఎన్ని పూర్తయ్యాయని, ఇంకా ఎన్ని ఇవ్వాల్సి ఉందని, మండలాల వారిగా అడిగి తెలుసుకున్నారు. మండలాల్లో ఎంతమంది కులం, ఆదాయం సర్టిఫికెట్ లేనివారు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. స్కాలర్‌షిప్ అప్లికేషన్స్ ఎందుకు లేట్ అవుతున్నాయని అడిగారు. హాస్టల్లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు. స్కూళ్లకు సంబంధించి స్కూల్ హెచ్‌ఎంలతో మాట్లాడి స్కూల్లో ఉన్న ఎస్సీ విద్యార్థుల దరఖాస్తులను పెట్టించాలని అన్నారు.పెండింగ్‌లో ఉన్న వాటిని పూర్తి చేయాలన్నారు. స్కాలర్‌షిప్ దరఖాస్తులకు ఆధార్‌కార్డు, బోనఫైడ్ తప్పనిసరి తీసుకుని సర్టిఫికెట్లు జారీ చేయాలని అన్నారు.బ్యాంక్ అకౌంట్ వివరాలు తప్పులు లేకుండా అప్లై చేయాలని, ప్రతిరోజు టార్గెట్ ప్రకారం చేయించాలని అధికారులను ఆదేశించారు. సిఆర్‌పిలకు రోజువారి టార్గెట్ ఇవ్వాలని, మార్చి 31 చివరి తేదీ వరకు ఎస్సీ స్కాలర్‌షిప్‌కు సంబంధించి కులం, ఆదాయం సర్టిఫికెట్‌లను మీసేవ వారితో మాట్లాడి సర్టిఫికెట్లు 100 శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌లకు సంబంధించి పెండింగ్ ఉన్న వాటిని పూర్తి చేయాలని ధరణికి సంబంధించి పెండింగ్ ఉన్న వాటిని పూర్తి చేసేందుకు తహసిల్దార్‌లు చర్యలు చేపట్టాలని అయిజ, కెటిదొడ్డి, అలంపూర్, మానవపాడు మండలాలలో పెండింగ్ ఉన్న వాటిని రెండురోజుల్లో పూర్తిచేయాలని, పట్టేదారు పాస్‌పుస్తకాలు తప్పులు లేకుండా చెక్‌చేసి పంపిణీ జరగాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్సీ కార్పోరేషన్ అధికారి శ్వేత ప్రియదర్శిని, డీఈఓ సిరాజుద్దిన్, అన్ని మండలాల తహసిల్దార్‌లు, ఎంఈఓలు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్‌కార్డు అప్డేట్ చేసుకోవాలి

**● మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ సీతారామారావు**



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సీతారామారావు

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,మార్చి 18 ప్రభాతవార్త:** ఆధార్‌కార్డు తీసుకుని పదేళ్లు దాటిన వారందరై అప్డేట్ చేసుకోవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. సీతారామారావు కోరారు. శనివారం ఆయన కలెక్టర్ కార్యాలయంలో జిల్లాస్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటి సమావేశంలో మాట్లాడుతూ ఆధార్ అప్డేట్ చేసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ముఖ్యంగా ఏదైనా ప్రభుత్వ పథకాల లబ్దిని పొందేందుకు, అదేవిధంగా బ్యాంకులలో ఇతర ఎలాంటి ప్రయోజనాలు పొందాలన్న ఆధార్ అప్డేషన్ తప్పనిసరి అన్నారు. ముఖ్యంగా జిల్లాలో ఆధార్ అప్డేషన్ కోసం ఇదివరకే ప్రజలకు విస్తృతంగా తెలియజేయడం జరిగిందని, ఇప్పటివరకు 2.6 శాతం మాత్రమే డాక్యుమెంట్ అప్‌డేషన్ చేయడం జరిగిందని, ఇంకా 3,40,261 ఆధార్ కార్డులను అప్డేట్ చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. దీంతోపాటు చిన్న పిల్లలకు సంబంధించి 3 వేల ఆధార్ అప్‌డేషన్ పెండింగ్‌లో ఉన్నాయని, వీరందరు అంగన్‌వాడి కేంద్రాలలో నమోదై ఉన్నారని, వీటిని వెంటనే అప్‌డేట్ చేయాల్సిందిగా ఆయన ఆదేశించారు. దీంతోపాటు, బయోమెట్రిక్ మాండేటరీ సంబంధించిన కార్డులు పాఠశాల స్థాయిలో పెండింగ్‌లో ఉన్నాయని, ఇవికూడా పూర్తి చేయాలని చెప్పారు. పైన పేర్కొన్న మూడు కేటగిరీలకు సంబంధించి దగ్గర్లోని ఆధార్ కేంద్రం లేదా మై ఆధార్ వెబ్‌సైట్‌లో హెచ్‌టిటిపి://మైఆధార్.యుఐడిఎఐ.జిఓవి.ఇన్ అప్డేట్ చేసుకోవచ్చని తెలిపారు. ఆధార్ అప్డేషన్ విషయంలో ఎక్కడైనా ఆధార్ కేంద్రం వారు ఎక్కువ డబ్బులు తీసుకున్న లేదా తప్పుడు ధృవపత్రాలు, తప్పుడు సమాచారంతో చేసినట్లయితే తగు చర్యలను తీసుకోవాలని ఆయన పోలీస్ అధికారులతో కోరారు. ఇకపై ఆధార్ అప్డేషన్‌పై ప్రతివారం సమీక్ష నిర్వహించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ వెల్లడించారు. అడిషనల్ ఎస్పీ రాములు, ఈడిఎం చంద్రశేఖర్, డిఆర్‌డిఏ యాదయ్య, జిల్లా సంక్షేమ అధికారిని జరినాబేగం, ఎన్ఐసిడిఐఓ మూర్తి, డిఇఓ యాదయ్య, డిఎంహెచ్‌ఓ డా. కృష్ణ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి చత్రునాయక్, ఎస్సీ దెవలప్‌మెంట్ ఆఫీసర్ పాండు, డిపిఓ వెంకటేశ్వర్లు తదితరులు సమావేశానికి హాజరయ్యారు.

## ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు గణనీయంగా తగ్గించవచ్చు

**▶▶ వనపర్తి జిల్లా ఇంఛార్జ్ కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్**

**▶▶ ఎక్స్ రోడ్డు దగ్గర ప్రమాదాలు జరగకుండా ఇంజనీర్లు తగు చర్యలు తీసుకోవాలి: వనపర్తి జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి**



**వనపర్తి ప్రతినిధి,మార్చి 18 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు రహదారి నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు గణనీయంగా తగ్గించవచ్చని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్ అన్నారు. శనివారం ఐడీఓసీ సమావేశ మందిరంలో రహదారి భద్రత కార్యక్రమాలపై డీఆర్ఎస్‌సీ జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి తో కలిసి రహదారి భద్రత కార్యక్రమాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ బైకులు ర్యాష్ గా నడిపిస్తుంటారని ట్రాఫిక్ పోలీసులు గమనించి రాష్ డ్రైవింగ్ నిరోధించాలని అన్నారు. బస్సులారీ, డ్రైవర్లకు హెల్త్ క్యాంపులు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితి పై చర్యలు తీసుకోవాలని అన్నారు. కంటి పరీక్షలు ఏర్పాటు చేసి బస్సు డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించాలని అన్నారు. కెపాసిటీ మించి వాహనాలు నడుపుతున్నారని వాటిని నిరోధించాలని తెలిపారు. జాతీయ రహదారిపై ఆటోలను నిషేదించాలని అన్నారు. అప్రోచ్ రోడ్ దగ్గర స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు.ప్రజలకు ట్రాఫిక్ పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ జాతీయ రహదారి ప్రాంతాలైన పెబ్బేరు, కొత్తకోట, పెద్దమందడి ప్రాంతాల పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వెల్టూరు ఎక్స్ రోడ్డు దగ్గర ప్రమాదాలు జరగకుండా ఇంజనీర్లు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. వెల్టూరు, కనిమెట్ట ఎక్స్‌రోడ్డు,పాలెం దాబ, మదర్ థెరిస్సా జంక్షన్, అమడబాకుల, ఆర్కే దాబ, ఫ్లై ఓవర్ బ్రిడ్జి, తోమాలపల్లి, ఆనంద భవన్ ఎక్స్ రోడ్, బైపాస్, రంగాపూర్ ఎక్స్ రోడ్ దగ్గర ప్రమాదాలు జరగకుండా చూడాలని అన్నారు. జాతీయ రహదారిపై సీసీ కెమరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, రోడ్ల మైనర్ రిపేర్ ఉంటే చేయాలని ఆర్ అండ్ బి అధికారికి ఏఎస్పీ షాకీర్ హుస్సేన్ సూచించారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో హైవే రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కమీషనర్లను కోరారు.నేషనల్ హైవే అధికారులు డి.ఎస్.పి.జాయింట్ ఇన్స్పెక్షన్ చేయాలని ఆదేశించిన కలెక్టర్ బైక్ నడుపుతున్నప్పుడు హెల్మెట్ ధరించి వెళ్లాలి, లేని ఎడల చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. అనంతరం జిల్లా కమిటీ మీటింగ్ ఆర్టీసీ సమీక్ష లో ఆర్టీసీ డిపో మేనేజర్ మాట్లాడుతూ నో పార్కింగ్ నో ఎంట్రీ జోన్ ప్రైవేట్ జీప్ ఆటోలు ఆపుతున్నారని పోలీస్ వాళ్లు చర్యలు తీసుకోవాలని కోరారు. తుఫాన్ బండ్లు హైవే లో స్పీడ్ గా వెళ్తున్నాయని, కెపాసిటీ కి మించి తీసుకుపోతున్నారు అట్టి వాటి పై చర్యలు తీసుకోవాలని ఎస్పీ ని కోరారు.వారానికి ఒకసారి ఎస్‌పీఆర్‌టీఓ కలిసి తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఏఎస్పీ షాకీర్ హుస్సేన్, డీఎస్పీ ఆనంద్ రెడ్డి, ఆర్ అండ్ బీ ఈఈ దేశ్యనాయక్, ఆర్టీసీ డిఎంపరమేశ్వరి, ఆర్‌టీఓ రమేశ్వర్ రెడ్డి, ఏఓ సాయినాథ్‌రెడ్డి, మదన్మోహన్, జాతీయ రహదారుల ఇంజనీర్ సుధాకర్, కమీషనర్ అనిల్, జాన్‌కృపాకర్,ఎంవిఐ అవినాష్, ఏఈలు, అధికారులు పాల్గొన్నారు.

## రెండు బైకులు ఢీ కొని ఒకరు మృతి

◆ ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

◆ శరీరం నుండి విడిపోయి 100 మీటర్ల దూరం పడిన మృతుని కాలు..

◆ ఆసుపత్రిలో మృతుని బంధువుల ఆందోళన.. పోలీసుల జోక్యంతో సద్దుమనిగిన వివాదం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మనిగిల్ల యువకుడు శివ

**పెద్దమందడి,మార్చి18 ప్రభాతవార్త:** రెండు బైకులు ఎదురెదురుగా వస్తూ ఢీ కొనడంతో 76ఏళ్ల వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో యువకుడు గాయాల పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాల్లోకి వెళితే అనకాయపల్లి తాండా కు చెందిన గన్య నాయక్(76) అతని మనవడు హరీష్ లు టీఎస్ 32 బీ 3605 నెంబర్ గల ద్విచక్ర వాహం పై పెద్దమందడి నుండి వనపర్తి వైపు వెళ్తుండగా మనిగిల్ల గ్రామానికి చెందిన బి.శివ అనే యువకుడు పల్సర్ బైక్ పై వేగంగా మనిగిల్ల నుండి పెద్దమందడి వైపు వస్తూ గణ్య నాయక్ బైక్ ను ఢీ కొట్టడంతో గణ్య నాయక్ అతని మనవడు హరీష్ లకు తీవ్ర గాయాలు అయ్యాయి.గణ్య నాయక్ కుడికాలు పల్సర్ బైక్ డిస్క్ బ్రేక్ లో ఇరుక్కుపోయి శరీరం నుండి కాలు విడిపోవడంతో 100మీటర్ల దూరంలో పడింది. తీవ్ర రక్తస్రావం కావడంతో పాటు పెద్ద ఎత్తున గాయాలు కావడంతో గణ్య నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. హరీష్‌ను మెరుగైన చికిత్స కోసం వనపర్తి కి తరలించారు. మనిగిల్ల గ్రామానికి చెందిన శివ కూడా తీవ్రంగా గాయపడడంతో అతన్ని పెద్దమందడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మృతుని బంధువులు సంఘటన స్థలానికి వచ్చి ప్రమాదానికి శివ అనే యువకుడే కారణమంటూ ఆసుపత్రిలో ఉన్న శివ పై దాడికి ప్రయత్నించారు. ఎస్సై హరిప్రసాద్ సిబ్బందితో ఆసుపత్రి దగ్గరికి వెళ్లి పరిస్థితిని చక్కదిద్దారు. పోస్టుమార్టం కోసం మృతదూహాన్ని వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు.సంఘటనపై గణ్యనాయక్ కుమారుడు దేవ నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిప్రసాద్ తెలిపారు.



మృతి చెందిన గణ్య నాయక్



ముళ్లపొదల్లో పడ్డ గణ్య నాయక్ బైక్

## కానిస్టేబుల్‌ను సన్మానించిన ఎస్పీ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 18 ప్రభాతవార్త:** ఫిబ్రవరి నెలలో హర్యానా రాష్ట్రంలో కురుక్షేత్ర ద్రోణాచార్య స్టేడియంలో నిర్వహించినటువంటి 4వ నేషనల్ మాస్టర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ 2023లో 5 కిలో మీటర్ల నడక విభాగంలో ఉప్పునుంతల పోలిస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ బంగారు పథకాన్ని,5 కిలో మీటర్ల రన్నింగ్‌లో కాంక్ష పతకం సాధించారు.10 కిలో మీటర్ల రన్నింగ్‌లో 5వ స్థానంలో నిలిచాడు. ఇంటర్నేషనల్ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన కానిస్టేబుల్‌ను ఎస్పీ మనోహర్ ఎస్పీ కార్యాలయంలో సన్మానించి ప్రశాంసపత్రాన్ని అందించారు.

## పది పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలి : డీఈఓ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి18 ప్రభాతవార్త:** ఏప్రిల్ 3 నుంచి ఏప్రిల్ 13 వరకు నిర్వహించనున్న 10వ తరగతి వార్షిక పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు పకడ్బంది ఏర్పాట్లు చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా డీఈఓ గోవిందరాజులు, సీ.ఎస్. డిపార్ట్‌మెంట్ అధికారులను శనివారం నాగర్‌కర్నూల్ పట్టణ కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఈ యేడాది నాగర్‌కర్నూల్‌లు జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలోని 295 పాఠశాలల నుంచి 10,572 మంది విద్యార్థులు అందులో 5180 అబ్బాయిలు, 5392 మంది అమ్మాయిలు పది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. వీరి కోసం 61 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సూచించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 10వ తరగతి పరీక్ష ప్రశ్న పత్రాలను నిర్ధేశించిన సమయానికే తెరువాలని, ప్రశ్నపత్రాలను తెరిసే సందర్భంలో సీల్ తీసేటప్పుడు తప్పనిసరిగా చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు తప్పనిసరిగా హాజరై సీసీ కెమెరాల సమక్షంలోనే ఓపెన్ చేయాలని, కేంద్రాల్లో నిర్వహించే ప్రక్రియను వెబ్ కా స్టింగ్ ద్వారా జిల్లా కలెక్టర్ పరిశీలిస్తారని, అందుకు అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ పరీక్షల నిర్వహణాధికారి రాజశేఖర్‌రావు, జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ నాగరాజు, సెక్షన్ వర్క్ వెంకట్, విశ్వనాథ్, అన్ని పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంటు, డిపార్ట్‌మెంటల్ అధికారులు పాల్గొన్నారు.

## చెరువులో పడి దివ్యాంగుడు మృతి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 18 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన పి.కుమార్ అనే దివ్యాంగుడు చెరువులో పడి మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ కేసరి సముద్ర చెరువులోని బతుకమ్మ ఘాట్ వద్ద శనివారం నీటిలో శవం తేలియాడుతున్న విషయం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. కుమార్ మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి మృతదేహన్ని జనరల్ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

**కల్వకుర్తి, మార్చి 18 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణ పరిధిలోని గాంధీనగర్ కాలనీలో 13, 22వ వార్డులలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టి త్వరగా పూర్తి చేసి కాలనీ వాసులకు అందుబాటులోకి తీసుకొని రావాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి, కౌన్సిలర్ బోజిరెడ్డి, నాయకులు శేఖర్‌రెడ్డి, ప్రహ్లాద్, వర్కాల శివ, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 18 ప్రభాతవార్త:** క్లాస్మెట్ క్లబ్ ఫౌండర్ వాస రాఘవేందర్ జన్మదినాన్ని పురస్కరించుకొని గగ్గలపల్లి, మంతటి పాఠశాలలోని విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను క్లాస్మెట్ క్లబ్ డివిజన్ ప్రధాన కార్యదర్శి చిగుళ్లపల్లి జ్యోతి రమణకుమార్ అందించారు. క్లాస్మెట్ క్లబ్ ఫౌండర్ వాస రాఘవేందర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆయన జన్మదిన సందర్భంగా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందించడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. క్లాస్మెట్ క్లబ్ తరుపున సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు గ్లాకోమ నివారణపై అవగాహన

**తెల్కపల్లి,మార్చి 18 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం కంటి సమస్యల వల్ల చిన్న పిల్లల్లోవచ్చే గ్లాకోమా వ్యాధి నివారణపై ఎల్వీ ప్రసాద్ కంటి వైద్య కేంద్రం, అనుబంధ సంస్థ కూచుకుల్ల రామచంద్రారెడ్డి నేత్ర వైద్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు మండల వైద్యాధికారి డా. దీపిక తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వ్యాధి గాయాల వల్ల, స్టీరాయిడ్స్ ఎక్కువగా తీసుకోవడం వల్ల వస్తుందని అన్నారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండి ఈ వ్యాధి బారిన పడకుండా ఉండాలని సూచించారు. అనంతరం మండల పురవీధుల గుండా గ్లాకోమా నివారణ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా. దీపికతో పాటు వైద్య సిబ్బంది హెచ్ఎంటి బాలస్వామి, దేవేందర్‌రావు, రాజు, ఆంజనేయులు, వెంకటయ్య, ఉపాధ్యాయులు, ప్రభాకర్, ఆనంద్ విద్యార్థులు పాల్గొన్నారు.

## బైక్ ఢీకొట్టడంతో వ్యక్తి మృతి

**లింగాల,మార్చి 18 ప్రభాతవార్త:** లిఫ్ట్ అడిగి బైక్ ఎక్కుతుండగా వెనకనుండి బైక్ ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కోమటికుంట గ్రామ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మండల పరిధిలోని దత్తారం గ్రామానికి చెందిన బాల్‌రెడ్డి (80) అనే వ్యక్తి కోమటికుంట గ్రామానికి వచ్చి, తన పని చూసుకుని తన సొంత గ్రామానికి వెళ్లడానికి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా మార్గ మధ్యలో బైక్ రావడంతో లిఫ్ట్ అడిగి ఎక్కుతుండగా వెనక నుండి అతి వేగంతో బైక్ వచ్చి బలంగా ఢీకొట్టడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్యగౌరమ్మ 10 సంవత్సరాల క్రితమే మృతి చెందింది. మృతునికి ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుని కుమారుడు వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

## అభివృద్ధే లక్ష్యంగా సిసి రోడ్డు నిర్మాణ పనులు

**లింగాల,మార్చి 18 ప్రభాతవార్త :** అభివృద్ధే లక్ష్యంగా సిసి రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ కోనేటి తిరుపతయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సిసి రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సిసి రోడ్ల నిర్మాణంలో భాగంగా 11వ వార్డులో చెన్నకేశవ దేవాలయం నుండి చేపట్టిన పనులను సర్పంచ్ కోనేటి తిరుపతయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోనేటి తిరుపతయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత గ్రామీణ ప్రాంతాల్లో సిసి రోడ్ల నిర్మాణం పనులు చేపట్టి అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గుంపల్లి నాగరాజు, బల్లారి నాగేశ్వర్, మహిళ అధ్యక్షురాలు అలివేలు, సింగిల్ విండో వైస్‌ఛైర్మన్ వెంకటగిరి, మాజీఎంపీటీసి మల్లేష్, బాలస్వామి, ఆంజనేయులు, శ్రీనివాసులు, జనార్ధన్, కృష్ణ పాల్గొన్నారు.

## బిజెపి కార్యకర్తలు ముందస్తు అరెస్టు

**ఇటిక్యాల,మార్చి 18 ప్రభాతవార్త:** వివిధ ఉద్యోగాల ప్రశ్నాపత్రాల లీకేజీపై బిజెపి పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలో భాగంగా హైదరాబాద్‌లో పలువురు నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బిజెపి పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టాలని పిలుపునివ్వడంతో శనివారం మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తా జాతీయ రహదారిపై బిజెవైఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టేందుకు సిద్ధమవుతుండగా ముందస్తుగా మండల పరిధిలోని కోదండపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో మండల పార్టీ అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, ఇటిక్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో బిజెవైఎం నాయకులు దశరథం సాగర్, సంపత్, శంకర్‌రెడ్డి, రాజేష్‌లను ఇటిక్యాల, కోదండపురం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. జాతీయ రహదారిపై ధర్నా చేపట్టేందుకు అనుమతులు లేవని సూచిస్తూ అనంతరం వారిని విడిచి పెట్టారు.

## కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా బూత్‌స్థాయిలో యువత పనిచేయాలి

**ఇటిక్యాల,మార్చి 18 ప్రభాతవార్త :** వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ గెలుపు లక్ష్యంగా బూత్ స్థాయిలో యువత పని చేయాలని ఆదేశించారు ప్రతి పోలింగ్ బూత్‌లో 5 మంది యువతను అన్ని వర్గాల వారికి అవకాశం కల్పించేలా బూత్‌స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి శ్రీనివాస్, జోగులాంబ గద్వాల జిల్లా యూత్ కాంగ్రెస్ పార్లమెంట్ వైస్ ప్రెసిడెంట్ దీపక్ ప్రజ్ఞ, యూత్ కాంగ్రెస్ నాయకులకు వివరించారు. శనివారం శాంతినగర్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో యూత్ జోడో పోలింగ్ బూత్ జోడోసమావేశాన్ని నిర్వహించగా ముఖ్య అతిథిగా ఏఐసిసి కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో అలంపూర్ యూత్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ఎర్రవల్లి సర్పంచ్ రవి, ఏఐ మండలాల నాయకులుపాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ చల్లాను సన్మానించిన మాజీ జడ్పీటిసి

**ఇటిక్యాల,మార్చి 18 ప్రభాతవార్త :** నూతన ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికగా శనివారం మండల పరిధిలోని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఇటిక్యాల మాజీ జడ్పీటిసి సుందర్, ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డిని శాలువా, పూలమాలలతో సన్మానించారు.

## మైసమ్మ దేవత పూజ సామానుకు వేలంపాట

**నవాబ్‌పేట,మార్చి 18 ప్రభాతవార్త :** మండలంలోని పర్వతాపూర్ దేవాలయంలో శనివారం అమ్మవారి పూజాసామాను టెంకాయలు,వాహనపూజ, పూలు, అలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో టెండర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సంజీవరెడ్డి టెంకాయలకు రూ. 25,05,000లకు దక్కించుకున్నారు. అలాగే వాహనపూజ రూ. 8,86,000లకు జి. రమేష్ దక్కించుకోగా మాజీ సర్పంచ్ ఉమ్మన్న పూలు, పూలదండలను రూ. 5,60,000లకు దక్కించుకున్నారు. ఈఓ మదనేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ టెండరు పొందిన వారు సేవా పాటలో అమ్మవారి పూజ సామాను, కొబ్బరి కాయలు, వాహనపూజ దక్కించుకున్న వారు సకాలంలో ఆలయ నియమ నిబంధనల ప్రకారం సకాలంలో డబ్బులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్ వీణవేణి, పాశం కృష్ణయ్య, గోపాల్, మాధవులు, వెంకటరెడ్డి, బక్క బాలయ్య, రమేష్ పాల్గొన్నారు.

# నిఖిత మృతికి కారకులపై చర్యలేవి?

- నిఖిత కుటుంబానికి న్యాయం జరిగేనా.?
- ప్రతిపక్షాల ధర్నా, రాస్తారోకోలు...







నిఖిత కుటుంబానికి న్యాయం చేయాలని రాస్తారోకో చేస్తున్న ప్రతిపక్షాలు

**అచ్చంపేట, మార్చి 18 ప్రభాతవార్త:** నవమాసాలు మోసి పేగు తెంచుకొని జన్మనిచ్చిన కుమార్తెను అల్లారుముద్దుగా పెంచుతూ ఉన్నత చదువులు చదివించి తమ కుటుంబానికి అండగా ఉంటుందని కొండంత ఆశలు పెట్టుకొని ఎన్నో కళలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబుద్దులకు పంపించిన ఆ తల్లిదండ్రులకు కన్నీటి శోకం మిగిల్చింది గురుకులం. గురుకులం దేవాలయంతో సమానమని, దేవాలయాల్లో ఉన్న దేవతలను కొలిస్తే శుభం జరుగుతుందని బావించిన తల్లిదండ్రులకు మన్ననూర్ గ్రామంలోని గురుకులం కడుపు కోతను మిగిల్చింది. నిన్నటి వరకు కళ్ల ముందే పారాడుతున్న కన్న కుతూరు ఒక్కసారిగా మృతి చెందిందనే వార్తను తట్టుకోలేక నిచత తల్లిదండ్రులు గుండెలు అవిసెలా రోధించారు. రెక్కాడితే కానీ డొక్కాడని పేద ప్రజలకు అందుబాటులో ఉన్నత విద్యను అందిస్తామని ప్రగల్భాలు పలికిన పాలకుల మాటలకు మన్ననూరు గురుకులంలో చోటు చేసుకున్న సంఘటన నిలువెత్తు నిదర్శనమని చెప్పుకోవచ్చు. నిచత గురుకులంలో 7వ తరగతి చదువుతూ తోటి విద్యార్థులతో తెలివగా అందరిని కలుపుకుంటూ తన విద్యా జీవితాన్ని సాగిస్తున్న తరుణంలో అకస్మాత్తుగా నిచత ఎలా చనిపోతోంది, నిచత తానువు చాలించేంత కష్టమె మోచ్చింది. తల్లిదండ్రులు తమ కుతూరును ఉన్నత విద్యలు చదివించాలనే గురుకులంలో చేర్పించారు. ఆ తల్లిదండ్రులు పస్తులు ఉన్న కూడా తమ కన్న కుతూరుపై పెట్టుకున్న ఆశలను కొనసాగించేందుకు ఎన్నో కష్టాలు పడుతూ నిచతను చదివిస్తున్నారు. ఇలాంటి తరుణంలో నిచత తరగతి గదిలో ఊరి వేసుకొని చనిపోవాల్సిన అవసరమేమిందున్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిచత మృతి చెందిన రోజు నుంచే తల్లిదండ్రులు, వివిధ పార్టీలకు చెందిన నాయ కులు నిచతది ఆత్మహత్య కాదని, హత్యేనని వాదించిన కూడా వారి మాటలను పాఠశాల సిబ్బంది, పాలకులు పెడచెవిన పెట్టి నిచత మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ఆసుపత్రికి హుటాహుటిన పంపించాల్సిన అవసరమేమి వచ్చిందన్న ప్రశ్నలు వెలువెత్తాయి. ప్రమాదవశాత్తు మృతి చెందిన మృతదేహలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే పోస్టుమార్టం నిర్వహిస్తారు కానీ నిచతమృతి అనుమానాలు రేకెత్తిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు,గ్రామస్తులు,తోటి విద్యార్థుల తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోధిస్తూ నిచతది హత్యేనని బహిరంగంగా విన్నవించిన వారి మాటలను పట్టించుకోకుండా అర్ధరాత్రి ఆసుపత్రిలోపోస్టుమార్టం ఎందుకు చేయాల్సి వచ్చింది. అదే రాత్రి పోలీసుల సహాయంతో నిచత స్వగ్రా మానికి మృతదేహన్ని తీసుకెళ్లిఖననంచేయడంపై పలు అనుమానాలు వెల్లువెత్తాయి. అనాటి నుంచి నేటి వరకు ప్రతిపక్ష పార్టీలు నిచతది ఆత్మహత్య కాదు...హత్యేనని హత్యకు కారకులైన వారిని శిక్షించాలని రాస్తారోకోలు, ధర్నాలు చేపట్టి అచ్చంపేట బంద్‌ను విజయవంతం చేశారు. శుక్ర వారం నిచత మృతదేహనికి రీపోస్టుమార్టం నిర్వహించడం తో పోస్టుమార్టంలోహత్యేనని తేలినప్పటికిహత్యకు గల కారకులనుశిక్షించడంలోపాలకులుఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

**నిఖిత చేసిన పాపమేమిటి:** మన్ననూర్ గురుకులంలో విద్యాబుద్దులు నేర్చుకోవడమే నిఖిత చేసిన పాపమా.!. తోటి విద్యార్థులతో పాటు సాయంత్రం క్రీడా ప్రాంగణంలో ఆడుతున్న విద్యార్థి నిఖిత ఒక్కసారిగా తరగతి గదిలోకి వచ్చి విగతజీవిగా పడటంపై పలు అనుమానాలు, తరగతి గదిలో నిచతకు ఏమి జరిగిందనే ప్రశ్నకు సమాధానం కరువైంది. సోషల్ మీడియా చక్కర్లు కొట్టిన పుకారు నిజమేనా.?, నిఖిత కళ్లతో చూడటమే నిచత మృతికి కారణమైందా.? ఎవ్వరి స్వార్థం కోసమో నిచత బలైందా.? అలా జరిగితే పాఠశాల యాజమాన్యం నిచత మృతికి గల కారకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారు, నిఖిత పేదింటి బిడ్డ కావడమేనా? గురుకులంలో విద్యాబుద్దులు నేర్పిస్తున్న ఉపాధ్యాయులను, మృతికి కారకులైన వారిని వెనుకేసుకొని రావడంలో అంతర్యామేమిటి. నిఖిత మృతికి కారకులపై చట్టపరమైన చర్యలు చేపడుతారా.?, నిచత కుటుంబానికి న్యాయం చేస్తారా లేక ప్రజా క్షేత్రంలో బంధీలుగా మిగులుతారా.?మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఆత్మరక్షణ, గౌరవం కల్పించాలని పాలక, ప్రతిపక్ష నాయకులు సభలు, సమావేశాల్లో ప్రగల్భాలు పలుకడమే తప్ప గురుకులంలో 7వ తరగతి విద్యార్థిని మృతి చెందితే మృతికి గల కారకులపై పాలక పక్షం నోరు మెదకపోవడంలో అంతార్యమేమిటి.పాలకపక్షం నిఖిత మృతికి గల కారకులపై చట్టపర్మైన చర్యలు తీసుకునేందుకు ఒత్తిడి చేసినట్లు అయితే నేటి వరకు నిచత ఆత్మ శాంతిచేదేమో.కానీ పాపం నిచత తల్లిదండ్రుల ఆలన పాలన నోచుకోకుండా తోటి విద్యార్థులతో విద్యాబుద్దులు నేర్చుకుంటున్న గురుకులమే తన పాలిట మృత్యువుగా మారింది. ప్రభుత్వ పారితోషికంతో న్యాయమా.?... నిందితుల శిక్షతో న్యాయమా.? మన్ననూరు గురుకులంలో 7వ తరగతి చదువుతున్న నిఖిత అకస్మాత్తుగా తరగతి గదిలో ఊరి వేసుకొని ఆత్మహత్య చేసుకుందన్న విషయం ప్రక్కకు పెడితే... నిచత ఆత్మహత్య చేసుకునేంత అధైర్యరాలు కాదని, ముమ్మాటికి నిచతది హత్యేనని తల్లిదండ్రులు, ప్రతిపక్షాలు వాదించారు. నిఖిత మృతి చెందడంతో పాలక వర్గం నిచత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయాన్ని అందించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కానీ నిచత మృతికి కారకులైన వారిని శిక్షించి నిఖిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వలేకపోయారు. నిచత కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందే ఆర్థిక సహాయం కంటే... నిచత మృతికి కారకులైన వారిని శిక్షించి ఉద్యోగం నుంచి తొలగిస్తే ఆ కుటుంబానికి పాలకులు న్యాయం చేసిన వారవుతారని పలువురు చర్చించుకుంటున్నారు. ఏదీ ఏమైనా కళ్ల ముందే కాటికి వెళ్లిన కుతూరు తిరిగిరాదని ఆ తల్లిదండ్రులకు తెలుసు కానీ తన బిడ్డ తనువు చాలించడానికి కారకులైన వారిని శిక్షించాలనే ఆ తల్లిదండ్రుల ఆవేదనకు పాలకులు ఎందుకు మద్దతివ్వడం లేదు. నిచత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకుంటామని కంటి తుడుపు చర్యగానే మిగులుస్తున్నారే తప్ప నిచత మృతికి కారకులైన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని హామీ ఎందుకు ఇవ్వలేకపోతున్నారు. నిచతది హత్యేనని కుటుంబ సభ్యులు మిన్నంటిన రోధనలతో వినిపించిన పాలకుల, గురుకుల యజమాన్యానికి వినిపించడం లేదా.? తరగతి గదిలో మృతి చెందిన నిచత మృతికి కారుకులెవ్వరనే విషయం గురుకుల యజమాన్యానికి తెలిసిన బయట పెట్టడం లేదా.?, గురుకుల యజమాన్యానికి ప్రభుత్వ అండదండలు ఉన్నాయాఅనే అనుమానాలు బహిరంగంగా వ్యక్తమవుతున్నాయి. నిచత కుటుంబం ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం కోసం ఎదురు చూడటం లేదని, తన బిడ్డను పొట్టన పెట్టుకున్న వారిని శిక్షించాలని కన్నీరు మున్నీరై విలపిస్తున్న నిచత తల్లి రోధనను చూసైనా న్యాయం జరిగేనా.?

## అమడబాకుల పులిగుట్ట సమస్యలపై గ్రామ ప్రజలకు అండగా ఎమ్మెల్యే



పులిగుట్టపై మైనింగ్ పనులు గ్రామస్థులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

**కొత్తకోట,మార్చి 18 ప్రభాతవార్త:** గత కొద్దిరోజులుగా మండల పరిధిలోని అమడబాకుల గ్రామంలో పులిగుట్టలో చేపడుతున్న మైనింగ్ వల్ల నరగామ భవిష్యత్తుగా మారుతుందని అటు గ్రామస్తులు ఆందోళన చేపట్టడంతో సమస్య పరిష్కారం కోసం దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి శనివారం అమడబాకులలో గ్రామస్తులతో కలిసి జరుగుతున్న పులిగుట్టలో మైనింగ్ పనులను ఆయన పరిశీలించారు. పులిగుట్ట ఒకవైపు ఎనుగుంట రిజర్వాయర్ మోడల్ స్కూల్ సబ్ స్టేషన్ ఉందని పులిగుట్టను తవ్వితే రిజర్వాయర్ కోల్పోతామని రిజర్వాయర్ ద్వారా మత్స్యకారులు సంబందించి వెయ్యి కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయని గొర్రెల కాపరులకు చెందిన మరో 500 కుటుంబాలు జీవనోపాధి ఉంటాయని సబ్ స్టేషన్ ద్వారా రైతాంగానికి పంటలు పండుతున్నాయని పులిగుట్ట మైనింగ్ తవ్వకాల వల్ల తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రామస్తులు ఎమ్మెల్యే ఆల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్తుల వైపే తను ఉంటానని కాంట్రాక్టర్‌కు వ్యతిరేకంగా కోర్టు తీర్పు వచ్చే వరకు న్యాయపోరాటం చేసి విజయం సాధిస్తామని కోర్టుకు సంబందించిన ఖర్చులు సగం తనే భరిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. 22 సంవత్సరాల క్రితం కాంట్రాక్టర్ ను 6నెలల క్రితమే స్థానిక నాయకులు న ఆ దృష్టికి తీసుకువస్తే మంత్రి నిరంజన్ రెడ్డి అప్పటి కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష వద్ద ప్రస్తావించి పనులు ఆపడం జరిగిందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. చేసేదేమి లేక కాంట్రాక్టర్ కోర్టును ఆశ్రయించి గ్రామస్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కాంట్రాక్టర్ ఆటలు సాగనీయకుండా కోర్టు తీర్పు వచ్చే వరకు గ్రామస్తుల వెంటనే ఉంటానని కొందరు రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పులిగుట్టను అడ్డను పెట్టుకొని రాజకీయం చేస్తున్నారని వారి ఉచ్చులో పడొద్దని ఎమ్మెల్యే గ్రామస్తులకు సూచించారు. ఆయన వెంట జడ్పీ వైస్ చైర్మెన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మెన్ చెన్నకేశవ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వంశీధర్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# పేదల సంక్షేమే లక్ష్యంగా పనిచేస్తాం

**కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ. 500లకే సిలిండర్ ఇస్తాం: కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు జి. మధుసూదన్‌రెడ్డి**



ప్రజలకు కాంగ్రెస్ పథకాలను వివరిస్తున్న జిఎంఆర్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,మార్చి18 ప్రభాతవార్త:** పేద,సామాన్య ప్రజల శ్రేయస్సు కోసం పనిచేసే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని గడప గడపకు కాంగ్రెస్ పార్టీ (హాత్ సే హాత్ జోడో యాత్ర) లో కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు జి. మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుంది, రూ. 500లకే సిలిండర్ అందిస్తుందన్నారు. మహబూబ్‌నగర్‌లోని టిడిగుట్ట 32,33 వార్డుల్లో స్థానిక కాంగ్రెస్ నాయకులు ఫక్రుద్దిన్, అషుభాయ్, సిరాజ్‌ఖాద్రి, లక్ష్మణ్ యాదవ్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను, కాంగ్రెస్ పార్టీ ప్రణాళికను, రాహుల్‌గాంధి సందేశాన్ని గడప గడపకు చేరవేసే ఉద్దేశంతో తలపెట్టిన హాత్ సేహాత్ జోడోయాత్రలో భాగంగా గడప గడపకు తిరుగుతూ ప్రజల కష్ట, సుఖాలను తెలుసుకుంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను, గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా జిఎంఆర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర సరుకుల ధరలు, సిలిండర్ ధరలు పెంచడంతో తమ పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందన్నారు. డబుల్ బెడ్‌రూంలు ఇస్తామని మోసం చేసిన టిఆర్ఎస్ పార్టీకి రాబోయే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని ప్రజల్ని కోరారు. వచ్చే సంవత్సరం జనవరి 1 తారీఖు నాటికి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడుతుందని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ. 500లకే సిలిండర్ అందిస్తామని, పేద, సామాన్య ప్రజలకు ఇండ్ల నిర్మాణానికి ఐదులక్షల ఆర్థికసహాయం అందిస్తామని కాంగ్రెస్‌పార్టీ కీలక హామీలను జిఎంఆర్ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, ఐఎన్‌టియుసి జిల్లాఅధ్యక్షుడు రాములు యాదవ్, జిల్లా కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి బెనహర్, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఫక్రుద్దిన్,అషుభాషు పాల్గొన్నారు.

## దళితుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

**అమరచింత,మార్చి 18 ప్రభాతవార్త:** దళితుల అభివృద్ధి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యం అని దళిత బంధు పథకం ప్రవేశపెట్టి దళితుల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తుందని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. శనివారం అమరచింత మండల పరిధిలోరి క్రిష్టంపల్లి గ్రామానికి చెందిన వెంకటమ్మ కు దళిత బంధు ద్వారా మంజూరు అయిన కారును ఎమ్మెల్యే తన నివాసంలో పంపిణీ చేశారు. దళిత బంధు ద్వారా లబ్ది పొందిన వారు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి లబ్దిదారులను కోరారు. ఈ కార్యక్రమంలో క్రిష్టింల్లి గ్రామ సర్పంచ్ బడా చెన్నమ్మ కురుమన్న, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బి.రాజు, సుధాకర్, అనిల్, గోపి, ఆది పాల్గొన్నారు.

## బీచుపల్లిలో పూజలు నిర్వహించిన ఎమ్మెల్సీ చల్లా

**ఇటిక్యాల,మార్చి 18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బీచుపల్లి పుణ్యక్షేత్రంలో గల ఆంజనేయస్వామి ఆలయంలో నూతన ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేల కోటాకింద ముఖ్యమంత్రి కెసిఆర్ ఎమ్మెల్సీగా అలంపూర్ మాజీ ఎమ్మెల్యే చల్లా వెంటరామిరెడ్డిని ఎంపిక చేయగా ఏకగ్రీవంగా ఎమ్మెల్సీగా చల్లా వెంకటరామిరెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం మండల పరిధిలోని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకోగా నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డికి స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించారు.కార్యక్రమంలో మాజీజడ్పీ ఛైర్మన్ బండారి భాస్కర్,జడ్పీటిసి హనుమంత్‌రెడ్డి, అలంపూర్ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ రాందేవ్‌రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ రంగారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పరమేశ్వర్‌రెడ్డి,సుదర్శన్‌రెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, బాలకృష్ణారెడ్డి, చంద్రహాస్‌రెడ్డి, రంగారెడ్డి, అనంతరెడ్డి, సర్పంచ్ రవిందర్‌రెడ్డి, ఎంపిపి స్నేహాశ్రీధర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి,బషీర్‌మియా,రవిప్రకాష్, కోటిరెడ్డి, తిరుపతిరెడ్డి, నంసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పదంగా మహిళా మృతదేహం లభ్యం

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,మార్చి 18 ప్రభాతవార్త:** జడ్చర్ల సమీపంలో గుర్తు తెలియని మహిళ శవం కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు హౌసింగ్‌బోర్డు కాలనీ 167వ జాతీయ రహదారి పక్కల గుర్తు తెలియని మహిళ (40) శనివారం ఉదయం లభ్యమైంది. మృతురాలి ఒంటిపై గాయాలు ఉండడం,ముక్కులో, చెవుల నుండి రక్తం కారుతుండడంతో మహిళ మృతిపై పలు అనూమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదవశాత్తు చనిపోయిందా లేక ఎవరైనా హత్య చేసి ఇక్కడేశారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.అనుమానాస్పదంగా గుర్తు తెలియని మహిళా శవం పడి ఉన్న విషయం తెలుసుకున్న స్థానిక పట్టణ సిఐ రమేష్‌బాబు,ఎస్సై లెనిన్‌గౌడ్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిసరాలను పరిశీలించారు. మృతురాలి వివరాలు సేకరించే పనిలో పడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోసుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిరాల్లోని సిసి ఫుటేజ్‌ని పరిశీలించి కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టనున్నట్లు సిఐ రమేష్‌బాబు తెలిపారు.

## తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

**లింగాల,మార్చి 18 ప్రభాతవార్త :** తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఇంఛార్జి ప్రధానోపాధ్యాయులు అరవింద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఇంఛార్జి ప్రధానోపాధ్యాయులుఅరవింద్ మాట్లాడుతూ ప్రతినెల పాఠశాలలో నిర్వహిస్తున్న తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని పిల్లల చదువు, పాఠశాల గురించి తెలుసుకోవాలన్నారు. విద్యార్థులకు చదువు చాల ముఖ్యమని చదువుకుంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షలు చాలా దగ్గరలో ఉన్నాయని, తమ ఇంట్లో టివికాని, మొబైల్ చూడనివ్వకుండా చదువుపై దృష్టి సారించే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయులు జి.శ్రీనివాసులు,వెంకట్‌రాజు,శంకరయ్య, శ్రీను,పురుషోత్తం,సుందరయ్య, జంగయ్య,పరశురాములు, పిడి స్వరూప, విష్ణు, సునితమ్మ, నిరంజన్, చాంప్లి, రవికుమార్, అశ్రఫ్, అహ్మద్, రహిమా తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల ఇంటి వద్దకు తపాలాశాఖ ద్వారా భద్రాద్రి తలంబ్రాలు

**మక్తల్,మార్చి 18 ప్రభాతవార్త :** భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం తపాలాశాఖ ద్వారా తలంబ్రాలు నేరుగా ఇంటికి అందిస్తామని తపాలాశాఖ నారాయణపేట సహాయ పర్యవేక్షకులు రవికుమార్ ఒకప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భద్రాద్రి శ్రీసీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం కోసం తపాలా శాఖ ద్వారా తలంబ్రాలు నేరుగా ఇంటికి అందిస్తామని అన్నారు. ఈనెల 29వ తేదీ సాయంత్రం 6 గం.ల వరకు బుక్ చేసుకున్న వారికి స్వామివారికి అర్చన చేసిన కళ్యాణ తలంబ్రాల కొరకు రూ. 450, ముత్యాల తలంబ్రాల కొరకు రూ 150 చెల్లించిన వారికి పది గ్రాముల కళ్యాణ తలంబ్రాలు, రెండు ముత్యాలు, కలకంద ప్రసాదం, అక్షింతలు, పసుపు, కుంకుమ అందజేస్తారని అన్నారు. ఆసక్తి గల భక్తులు సమీపంలోని తపాలా కార్యాలయం, పోస్టుమాన్‌కు నగదు అందించవచ్చన్నారు. నారాయణపేట జిల్లా వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## బిజెపి నాయకుల ముందస్తు అరెస్టు

**మహ్మదాబాద్,మార్చి 18 ప్రభాతవార్త:** పరీక్షలు రద్దు చేయడం ద్వారా అనేకమంది యువత ఆత్మహత్యలు చేసుకునే అవకాశం ఉందని నిరుద్యోగులకు మద్దతుగా శనివారం మహ్మదాబాద్ మండల కేంద్రంలో బిజెపి, బిజెవైఎం ఆధ్వర్యంలో ధర్నాలకు పిలుపునివ్వగా ముందస్తుగా బిజెపి నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో బిజెపి మండల అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ టిఎస్‌పిఎస్‌సిలో సుమారు 30లక్షల మంది యువత రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అంతటి వ్యవస్థలో కోడింగ్, డీకోడింగ్ లేకుండా ఎలా ఉంటుంది. ప్రభుత్వం కావాలని పరీక్షలురద్దు చేయాలని కిందిస్థాయిఅధికారులపై చర్యలు తీసుకుంటామని మొత్తంగా పరీక్షలు రద్దుచేయడం వల్ల అనేక మంది యువత ఆత్మహత్యలు చేసుకునే అవకాశం ఉందని అన్నారు. కాపియింగ్ చేసిన అభ్యర్థులను గుర్తించి వారికి మళ్లీ (జిఒ)జారీ చేసి వారికి మాత్రమే పరీక్షలు నిర్వహించాలని కోరారు.

## మండలంలో అకాలవర్షం

**నవాబ్‌పేట,మార్చి 18 ప్రభాతవార్త:** మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం సాయంత్రం అకాలవర్షం కురిసింది. ఈ వర్షం వల్ల మండలంలోని మరికల్, యన్మన్‌గండ్ల, ఇప్పటూర్, కాకర్జాల, దర్పల్లి గ్రామాల్లో ఇటుక బట్టీలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. దీంతో నిర్వాహకులకు లక్షల్లో నష్టం వాటిల్లింది. అలాగే మామిడి తోటల్లో వానగాలికి మామిడి కాయలు నేలరాలాయి. వరి పంటకు మేలు చేకూర్చింది. అకాల వర్షంతో నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఇటుక బట్టీల వ్యాపారులు, మామిడి రైతులు కోరుతున్నారు.

## యువత స్వయం ఉపాధిలో రాణించాలి: ఎమ్మెల్సీ

**ఇటిక్యాల,మార్చి 18 ప్రభాతవార్త:** యువత స్వయం ఉపాధిని ఏర్పాటు చేసుకుని వ్యాపార రంగాలలో ముందుకు రాణించాలని ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి యువతకు సూచించారు. శనివారం మండల పరిధిలోని పొగాకు కంపెనీ స్టేజీలో రవికుమార్‌కు చెందిన ఎంఆర్ ఆయ్, బేకరీ కేంద్రాన్ని ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కె.జయలక్ష్మి, జడ్పీటిసి హనుమంత్‌రెడ్డి, అలంపూర్ మార్కెట్ యార్డు మాజీఛైర్మన్ రాందేవ్‌రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్‌రంగారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, చంద్రహాస్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి,సుదర్శన్‌రెడ్డి, రంగారెడ్డి, రవిందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, అనంతరెడ్డి ఉన్నారు.

## వ్యవసాయ కార్మిక సంఘాలకు మద్దతు తెలిపిన మాజీ మంత్రి

**వనపర్తిటౌన్,మార్చి18 ప్రభాతవార్త:** సీఐటీయు సమస్యలను పరిష్కరించాలని గత 3రోజులుగా సమ్మె చేస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాలకు మద్దతు తెలిపిన మాజీ మంత్రి, ఏఐసీసీ కార్యదర్శి డా.జి. చిన్నారెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు, పెన్షన్ రూ.10వేలు అందరికి చెల్లించాలని ఆయన కోరారు. అగ్నిపథ స్కీం ను రద్దు చేయాలని, పనిని కాంట్రాక్టైజేషన్ చేయరాదని, గ్యారంటీతో కూడిన సేకరణ తో పాటు అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర సీటు+50% ఉండేలా ఇచ్చి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి రైతులకు కేంద్ర ప్రభుత్వం ఒకేసారి రుణమాఫీ చేయాలని 60ఏళ్లు పైబడిన అందరికి పెన్షన్ చెల్లించాలని పేర్కొన్నారు. నాలుగు లేబర్ కోడ్స్, విద్యుత్ సవరణ బిల్లు 2022 ను రద్దు చేయాలని అందరికి ఉద్యోగ భద్రత కల్పించి హామీ ఇవ్వాలని ఎమ్‌జీఎమ్ ఆర్ జీఏ స్కీమ్ ను విస్తరించి పని రోజులు 200వందలకు పెంచాలని, రోజుకు కనీసం వేతనం రూ.600 చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.పెండింగ్‌లో ఉన్న బకాయి వేతనాలు చెల్లించిజాతీయ పట్టణఉపాధిహామీచట్టం చేయాలని కోరారు.

# ప్రారంభమైన ఆరాధన మహోత్సవాలు

**- వైభవంగా అఖండ హరేరామనామ సంకీర్తన**

**దేవరకద్ర,మార్చి 18 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం నార్లోనికుంటలోని శ్రీ పూజ్య రమణానందగిరి స్వామివారి 12వ ఆరాధన మహోత్సవాలు శని వారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఏడాది గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి దేవస్థానం పక్కనున్న స్వామి దేవస్థానంలో స్వామి వారి ఆరాధన మహోత్సవాలను నార్లోనికుంటలో ఘనంగా ఎంతో భక్తిశ్రద్ధలతో సాంప్రదాయరీతిలో నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడ స్వామి వారి ఆరాధన మహోత్సవాలు ప్రారంభం అయ్యాయి. దీనికి గాను నిర్వాహకులు,గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. హైదరాబాద్‌లోని జుమ్మేరాత్‌బజార్ వద్దనున్న ఆత్మభోధానంద పీఠాధిపతులు, శివరామ కోటి యజ్ఞ కార్యనిర్వాహణ అధ్యక్షుడు శ్రీసచ్చిదానందయోగీశ్వరుల వారి అధ్వర్యంలో ఈ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి.

**వైభవంగా అఖండ హరేరామనామ సంకీర్తన:** ఉత్సవాలలో స్వామివారి సన్నిధిలలో మొదటిరోజు ఉదయం 8లకు నిర్వాహకుడు యాదయ్యాచారి అధ్వర్యంలో అఖండ హరేరామనామ సంకీర్తన పూజా కార్యక్రమంతో ఆరాధన మహోత్సవాలకు శ్రీకారం చుట్టారు. రమణానందగిరి స్వాముల వారి శిష్య బృందం అధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను కూడ నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాండురంగాచార్యులు, జగదీశ్వరస్వామి, శివమ్మ మాత, జ్ఞానేశ్వరస్వాములు హాజరయ్యారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఈఆరాధన మహోత్సవాలకు అధికసంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా స్వామివారి దేవస్థానం ముందు వచ్చిన పందిరి వేశారు. రంగురంగు విద్యుత్ బల్బులతో దేవస్థానాన్ని శోభా యమా నంగా ముస్తాబు చేశారు. స్వామివారిని పూలతో అలంకరించారు.

**నేడుభగవద్గీత హవనం:** దేవరకద్ర మండలం నార్లోనికుంట లోని శ్రీ పూజ్య రమణానందగిరి స్వామివారి 12వ ఆరాధన మహోత్సవాల భాగంగా ఆదివారం భగవద్గీతహవనం పూజా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. మహాత్ముల ఆధ్యాత్మిక ప్రసంగాలు,వారికి సనా న్మానం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు యాదయ్యచారి తెలిపారు.



అలంకరణలో రమణానందగిరి స్వామి



నార్లోనికుంటలో అఖండ భజన చేస్తున్న భక్తులు

# పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ సీఎం కేసీఆర్ రాజీనామా చేయాలి

**◆తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా అధ్యక్షులు ఖాదర్ పాష**

**వనపర్తి టౌన్,మార్చి 18 ప్రభాతవార్త:** తెలంగాణ పబ్లిక్ కమీషన్ బోర్డు పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు రాజీనామా చేయాలని తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా అధ్యక్షులు ఖాదర్ పాష డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్ పీఎస్‌సీకి నిర్వహించిన ప్రశ్న పత్రం లీకుల వ్యవహారం పై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచార జరిపించాలని, అవకతవకలకు పాల్పడి అభ్యర్థుల మనోవేదనకు కారణమైన పేపర్ లీక్ చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన పేర్కొన్నారు. నోటిఫికేషన్ రద్దు ద్వారా నష్ట పోయిన ప్రతి నిరుద్యోగ అభ్యర్థికి రూ.1లక్ష రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ టీఎస్‌పీఎస్‌సీ పశ్న పత్రం లీకులపై స్పందిచి వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రస్తుత తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ బోర్డును ప్రక్షాళన చేసి పారదర్శకంగా ఉద్యోగులను భర్తీ చేయాలని, రాష్ట్రంలో ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను చేపట్టాలని తెలిపారు. మేనిఫెస్టోలో ప్రకటించిన రూ.3016 నిరుద్యోగ భృతిని వెంటనే నిరుద్యోగ యువతకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బాలకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి షరీఫ్, టౌన్ అధ్యక్షులు రఘు నాయుడు, మండల అధ్యక్షులు పిక్కిలి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు ఖాదర్ పాష

## పిల్లల ఎదుగుదలకు తల్లిదండ్రుల పాత్ర కీలకమైనది

**◆ఎంపియుపిఎస్ దాసరిదొడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్‌రెడ్డి**



పేరెంట్స్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు

**మక్తల్,మార్చి 18 ప్రభాతవార్త :** జిల్లా విద్యాశాఖాధికారి, మండల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఆదేశాల మేరకు మార్చి 2023 గాను తరగతుల వారిగా శనివారం ఉదయం పాఠశాల ఆవరణలో పేరెంట్స్, టీచర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లల విద్యాపరమైన ఎదుగుదలకు తల్లిదండ్రుల పాత్ర కీలకమైనదని,గ్రామీణ ప్రాంతంలోని చాలామంది తల్లిదండ్రులు వ్యవసాయ, ఇతర పనుల్లో నిమగ్నమై ఉన్నందున వారు సమావేశానికి హాజరయ్యేందుకు వీలుగా పిటిఎంను ఉదయం నిర్వహించామని అన్నారు. విద్యార్థులు ఒత్తిడిలేని వాతావరణంలో పరీక్షలకు సిద్ధం కావాల్సిన అవసరం ఉందని వారికి సూచనలు ఇచ్చారు. పిటిఎం సమావేశానికి రాని వారి వివరాలు ఆరా తీశారు.వారు కూడా ముమ్ముందు పిటిఎం సమావేశాలకు హాజరయ్యే విధంగా చూసుకోవాలని గ్రామపెద్దలను కోరారు. పిటిఎం సమావేశ మినిట్స్‌ను ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసుకున్నారు.సమావేశంలో పాఠశాల విద్యాకమిటి ఛైర్మన్ మడుగు సుజాత దేవేంద్రప్ప,వైస్ ఛైర్మన్‌సురేష్, విద్యార్థినీ,విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు విధుర్‌కుమార్, వరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

## దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌ధరలు

**దేవరకద్ర,మార్చి 18 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు శనివారం 35 కింటాళ్ళ ఆముదాలను రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. అయితేకింటాల్ ఆముదాలకుఅత్యధికంగా రూ.6262 ధర పలికింది. అలాగే అతి తక్కువగా రూ.6109 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యేను కలసిన నాయకులు

**దేవరకద్ర,మార్చి 18 ప్రభాతవార్త:** జడ్చర్లలో శుక్రవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్‌ను మండల నాయకులు కలిశారు. ఆయన గృహప్రవేశానికి వారు కలసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. మాజీ ఎమ్మెల్యేను కలసిన వారిలో కోయిల్‌సాగర్ చందూగౌడ్ తదితరులు ఉన్నారు.అలాగే దేవరకద్రకు చెందిన టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ కూడ మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్‌ను కలసి శుభా కాంక్షలు తెలిపారు.



## చల్లబడ్డ వాతావారణం

**దేవరకద్ర,మార్చి 18 ప్రభాతవార్త:** దేవరకద్రలో శనివారం వాతావరణం చల్లబడింది. గత రెండ రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది.దీంతో ఉక్కపోతతో సతమతమైన ప్రజలు ఉపశమనం పొందుతున్నారు.

## ఘనంగా వాసవిమాత పల్లకిసేవ

**-అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు**



**దేవరకద్ర, మార్చి 18 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం రాత్రి అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పల్లకిలో తీసుకొని దేవస్థానం చుట్టూ ప్రదిక్షణలు నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు,భక్తులు హరినామశ్చరణల మద్య ఈ సేవ ముందుకు కదిలింది. అనంతరం అమ్మవారి సన్నిధిలో అర్చకుడు హరిశంకరశర్మ అధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు తదతర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవిమాత అమ్మవారు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం అధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

**ఘనంగా కుంకుమార్చన:** దేవస్థానంలో శ్రీచక్రాలతో అమ్మవారికి కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.అలితా సహస్రనామ పారాయణం కార్యక్రమాన్ని కూడ నిర్వహించారు. మహామంగళహారతి, ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ కల్వ కన్నయ్యశెట్టి, మహిళాసంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజుల రాణి,జిల్లా యువజన సంఘం కార్యదర్శి దోమహరికాంత్‌లతో పాటు స్థానిక ఆర్యవైశ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# పేదలకు వరప్రధాయిని సీఎం రిలీఫ్ ఫండ్

**◆ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి**

**పాన్‌గల్,మార్చి 18 ప్రభాతవార్త:** ఆపదలో ఉన్న నిరుపేదలకు, మధ్య తరగతి కుటుంబీకులకు సీఎంఆర్‌ఎఫ్ పథకం ఆసరా వంటిదని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని బుసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చిన్నమ్మ గత కొంత కాలం క్రితం అనారోగ్యంతో హైదరాబాద్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. దీనికి సంబంధించి ముఖ్యమంత్రి సహాయ నిధికి మంజూరు చేసుకోగా ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి చొరవతో రూ.2 లక్షలు మంజూరు కాగా ఆ చెక్కులు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి గ్రామంలోని బాదితురాలు ఇంటికి వెళ్లి చెక్కును అందజేశారు. చెక్కు మంజూరు కోసం కృషి చేసిన ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రాము యాదవ్. రైతు సమన్వయ సమితి సభ్యులు వెంకటయ్య నాయుడు లకు బాదిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంటబీఆర్‌ఎస్ నాయకులు,ఎంపీటీసీ సుబ్బయ్య యాదవ్,దశరథ నాయుడు,దేవేంద్ర నాయుడు, రఘుపతి నాయుడు, ఉపేందర్, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే బీర్షవర్ధన్‌రెడ్డి

## సర్పంచ్ మృతి గ్రామానికి, పార్టీకి తీరని లోటు: ఎమ్మెల్యే




సర్పంచ్ సుఖేంద్ర నాయుడు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

**పాన్‌గల్,మార్చి 18 ప్రభాతవార్త:** రాయినిపల్లి గ్రామ సర్పంచ్ సుఖేంద్ర నాయుడు మృతి గ్రామానికి అటు పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని రాయినిపల్లి గ్రామానికి చేరుకొని సర్పంచ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పిం చారు. వారి కుటుంబ సభ/్యలతో మాట్లాడి మనోధైర్యం ఇచ్చారు. కుటుంబం సభ్యులు పెద్ద దిక్కున కోల్పోవడంతో పార్టీ పంగాను, ప్రభుత్వ పరంగాను అన్ని విధాల కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కాగా సర్పంచ్ మృతి వార్త తెలుసుకున్న మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు,ప్రజా ప్రతినిధులు పెద్దఎత్తున గ్రామానికి చేరుకొని ఆయన మృతికి సంతాపం తెలిపారు. సర్పంచ్ అంతిమాత్రలో పాల్గొని ఘన నివాళి అర్పించారు. ఆయనవెంట ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రాము యాదవ్, మండల రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ వెంకటయ్య నాయుడు, బీఆర్‌ఎస్ నాయకులు చంద్రశేఖర్ నాయక్, దశరథ నాయుడు, రాఘవేంద్ర నాయుడు, రఘుపతి నాయుడుతో పాటు మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఒక పేద విద్యావంతుడి ప్రాణం విలువ రూ.7లక్షలా..?!

**● నిరుద్యోగులను చిన్న చూపు చూడడం తగదు: ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.డి.కుతుబ్**

**అమరచింత,మార్చి 18 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్ దగ్ధం సంఘటనలో ప్రాణాలు కోల్పోయిన ఆరుగురు ఇంజనీరింగ్, డిగ్రీ చదివారని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కొక్కరికి కేవలం రూ.7లక్షలు మాత్రమే ఎక్‌గ్రేషియా ప్రకటించడం ఆక్షేపనీయమని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.డి.కుతుబ్ విమర్శించారు. శనివారం అమరచింత మండలం కొంకనోని గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద కుటుంబానికి చెందిన ఆ విద్యార్థులను ఆ తల్లిదండ్రులు ఎంతో శ్రమ కోర్చి చదివించారని క్యూ నెట్వర్క్ లో విధుల్లో ఉండగా ఈ ఘోరం జరిగిందని అన్నారు. వివిధ జిల్లాలకు చెందిన అమరరాజు, ప్రశాంత్, ప్రమిల, శ్రావణి, వెన్నెల, శివ, ఇంజనీరింగ్, డిగ్రీ చదివారని అన్నారు. వారందరి వయస్సు 25ఏళ్ల లోపు అని అన్నారు. భవిష్యత్తు పై వారు, వారి తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని ప్రమాదంలో కాలి పోయారని అన్నారు.ఉదారంగా ఆదుకోవాల్సిన సీఎంరూ.5లక్షలు, పీఎం లు రూ.2 లక్షల మొత్తం రూ.7లక్షలు మాత్రమే ప్రకటించడం దారుణమని అన్నారు. పేద నిరుద్యోగులను చిన్న చూపు చూడడమేనని ఇది తగదని ఆయన విమర్శించారు. రాష్ట్రం రూ.15లక్షలు, కేంద్ర రూ.10లక్షల చొప్పున ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల చెందిన గ్రూప్ వన్ అభ్యర్థి నవీన్ పరీక్ష రద్దుతో ఆత్మహత్య చేసుకున్నారని, ఆదుకుంటామని సీఎం ప్రకటించారని రూ.25లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు. ప్రశ్నా పత్రాల లీకేజీ ప్రభుత్వ వైఫల్యమని బాధ్యత వహిస్తూ, నిరుద్యోగుల కోచింగ్ ఫీజులను ఖర్చులను ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. లీకేజీలు పునరావృతం కారాదని అన్నారు. త్వరలో ఎన్నికలు రాబోతున్నందున ఉద్యోగాల భర్తీ త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జి.మల్లేష్; విష్ణు, రాజు, సాయిలు, రవి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.డి.కుతుబ్

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ధ్యేయం

**ధరూర్,మార్చి 18 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రేవతి ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమావేశం శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంచేలా ప్రభుత్వం యోచిస్తున్నదని, ఇందుకోసం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటి (ఎస్‌ఎంసి)తో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సమావేశాలు నిర్వహిస్తుందని పాఠశాల హెచ్‌ఎం రేవతి సమావేశంలో తెలిపారు. పురోగతి, హాజరు, పిల్లల ప్రవర్తన, చదువుల మూల్యాంకనం ఇతర అంశలను తల్లిదండ్రులు నేరుగా ఉపాధ్యాయులతో చర్చించారు. పిల్లలచదువు, పరీక్షాఫలితాలు తెలుసుకోవడంతో పాటు మధ్యాహ్న భోజనం అమలు తీరును తల్లిదండ్రులు స్వయంగా పర్యవేక్షించవచ్చుని, దీంతో నాణ్యత మెరుగుపై అవకాశం ఉందని హెచ్‌ఎం విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. ఈ సమావేశంలో ఎస్‌ఎంసి ఛైర్మన్ సుజాత, ఉపాధ్యాయులు కిశోర్‌చంద్ర, నీలవతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం రేవతి

## వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండ ప్రశాంత్‌రెడ్డి**



**దేవరకద్ర,మార్చి 18 ప్రభాతవార్త:** ప్రస్తుత ం కురుస్తున్న వర్షాల కారణంగా మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండ ప్రశాంత్‌రెడ్డి సూచించారు. దేవరకద్రలో ఆయన మాట్లాడారు. వర్షాల కారణంగా పిడుగులు పడే అవకాశం ఉందన్నారు. కావున ప్రజలు ఉ ఉరుములు, మెరు పుల సమయంలో ఇళ్ళ నుండి బయటకు రాకూడదన్నారు. ట్రాన్స్ ఫార్మర్లు,విధ్యుత్ స్థంబాలకు దూరంగా ఉండాలన్నారు. పొలాల్లో పనిచేసే రైతులు సురక్షిత ప్రాంతాలలో ఉండాలని ప్రశాంత్‌రెడ్డి సూచించారు.వర్షాలు పడుతున్నప్పుడు చెట్లు,టవర్ల కింద నిలబడరాదన్నారు.అలాగే వర్షాలు పడుతున్నప్పుడు సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను ఉపయోగించరాదన్నారు. అలాగే టీవీలు,ఫ్రిజ్‌లు సాధ్యమైనంతవరకు స్విచ్ ఆఫ్ చేయడం మంచిదన్నారు.

## భక్తులకు అన్నదానం



అడ్డాకుల ఎస్సై విజయ్ కుమార్ సహకారంతో శ్రీకందూరు రామలింగేశ్వర స్వామి దేవాలయంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

**అడ్డాకుల,మార్చి 18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కందూరు గ్రామ శివారులో దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీకందూరు రామలింగేశ్వర స్వామి జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రామలింగేశ్వర స్వామికి దాసంగ నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అడ్డాకుల ఎస్సై విజయ్ కుమార్ సహకారంతో జాతరకు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.రామలింగేశ్వర స్వామి జాతర శ్రీరామ నవమి వరకు కొనసాగుతుంది. వచ్చిపోయే భక్తులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించినట్లుకార్యవర్గసభ్యులు,ఆలయకమిటీ చైర్మెన్‌రమేష్‌గౌడ్ తెలిపారు.

## శిలా ప్రహరీ నిర్మాణానికి నగదు వితరణ



ఆలయ అభివృద్ధికి విరాళం అందజేస్తున్న దృశ్యం

**మల్దకల్, మార్చి 18 ప్రభాతవార్త:** మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవాలయం చుట్టు నిర్మిస్తున్న శిలా ప్రహరీ నిర్మాణానికి దాతలు విరివిగా ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందజేస్తూ భక్తిని చాటుకుంటున్నారు.దేవాలయ ఛైర్మన్ ప్రహ్లాదరావు ఈఓ సత్యచంద్రారెడ్డి ఆధ్వర్యంలో దేవాలయ అర్చకులు రమేష్ ఆచారి శిలాప్రహరీ గోడ నిర్మించాలనే సంకల్పంతో వారి ఆధ్వర్యంలో శిలాప్రహరీ రూపుదిద్దుకుంటున్నందున పలువురు భక్తులు ఆర్థిక సహాయం అందజేస్తున్నారు.ఇందులో భాగంగా శనివారం కోయంబత్తూరు (ఎల్కు)రుకు చెందిన ఇల్లూరు కార్తీక్ తండ్రి తిమ్మయ్య రూ.1,25,000ల నగదు ఆలయ అర్చకులు రవికి అందజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ రావు,మధుసూదన్‌రెడ్డి, సాయికుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, పెద్దొడ్డి వీరారెడ్డి, బాదామిశ్రీనివాసులు, మనసాని నాగరాజు, ఎం. నాగరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పలు వివాహ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే



**గద్వాల ప్రతినిధి,మార్చి 18 ప్రభాతవార్త:** గద్వాల నియోజకవర్గంలో పలు వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. నూతన వధూవరులకు కానుకలు అందజేశారు.కార్యక్రమంలో రాష్ట్ర వినియోగదారుల ఫోరం ఛైర్మన్ గట్టు తిమ్మప్ప,ఎంపిపివిజయ్, జడ్పీటిసి రాజశేఖర్, వైస్ ఎంపిపి రామకృష్ణ నాయుడు, పిఎసిఎస్ ఛైర్మన్ వెంకటేష్, రైతుబంధు సమితి మండల పార్టీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, మండల కోఆప్షన్ మెంబర్,బిఆర్‌ఎస్ పార్టీ నాయకులుచక్రధర్‌రావు, శేఖర్, వెంకటన్నగౌడ్,శేఖర్, వెంకటేష్‌నాయుడు, మధుసూదన్‌రెడ్డి, మహేష్, నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో పేరెంట్స్ సమావేశం



ఎరెంట్స్ సమావేశంలో మాట్లాడుతున్న జిహెచ్‌ఎం అనిల్‌గౌడ్

**మక్తల్,మార్చి 18 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం జడ్పీహెచ్ఎస్‌లో పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి జిహెచ్‌ఎం అనిల్‌గౌడ్ మాట్లాడుతూ ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యార్థులను ప్రతిరోజు పాఠశాలకు పంపించాలని వారి పుస్తకాలపై నోట్‌బుక్స్‌పై దృష్టి సారించాలని, పరీక్షల కొరకు 6,7,8 తరగతులను గ్రూప్ స్టడీ చేయించమని,9వ తరగతి చదివించాలని పదవ తరగతి విద్యార్థులను ఈ 15రోజుల కాలము ఎలాంటి ఇతర పనులు చెప్పకూడదని విద్యార్థుల వెనుకబడిన అంశాలను మళ్లీ మళ్లీ చదివించి పరీక్షలకు సంసిద్ధులు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## ప్రశాంతంగా కొనసాగుతున్న ఇంటర్ పరిక్షలు

**దేవరకద్ర,మార్చి18 ప్రభాతవార్త:** దేవరకద్రలో ఇంటర్ పరిక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి.15 నుండి ఈ పరిక్షలు ప్రారంభమయ్యాయి. పరిక్షల సందర్భంగా పరిక్షా కేంద్రంవద్ద గట్టి పోలీస్ బందో బస్తు ఏర్పాటు చేశారు. దీనికి గాను సంబందిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## అమరచింత మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా కె.జి మహేందర్‌రెడ్డి ఎన్నిక



**అమరచింత,మార్చి18 ప్రభాతవార్త:** అమరచింత మండల కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని శనివారం అమరచింత మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్, నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాకిటి శ్రీహరి, మక్తల్ నియోజకవర్గంకాంగ్రెస్ నాయకులు పోలీసు చంద్రశేఖర్ రెడ్డి, వనపర్తి జిల్లాకాంగ్రెస్‌పార్టీ కార్యదర్శి ఆయూబ్‌ఖాన్ సమక్షంలో అమరచింత మండల కాంగ్రెస్ అధ్యక్షులు కె.జి.మహేందర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కాంగ్రెస్ పార్టీబీసీ సెల్ అధ్యక్షులుగా పోసిరి విష్ణు, యువజన సంఘంమండల అధ్యక్షులుగా శ్యాంకు మార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కురుమన్న, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ప్రకాశంలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ఎస్.ఎమ్ అరుణ్ కుమార్, తౌఫిక్, సత్యన్న రవి, శివ, తిరుపతి పాల్గొన్నారు.

## 18.3 ఫీట్లకు తగ్గిన కోయిల్‌సాగర్ నీటిమట్టం

**దేవరకద్ర,మార్చి 18 ప్రభాతవార్త:** జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్ నుండి ఆయకట్టుకు కుడి,ఎడమ కాలువల ద్వారా నీటి సరఫరా శనివారం కూడ కొనసాగింది. గత మూడు రోజుల క్రితం ఆయకట్టుకు నీటిసరఫరాను సంబందిత అధికారులు ప్రారంభించారు. ఈ విధంగా ఆయకట్టుకి నీటిని విడుదల చేయడం ఇది 5వ సారి. ఆయకట్టుకు నీటిని సరఫరా చేస్తుండటంతో ప్రాజెక్టులో నీటిమట్టం 18.3 ఫీట్లకు తగ్గింది. ఆయకట్టుకు నీటిని సరఫరా చేస్తుండటంతో ప్రాజెక్టులో క్రమేపి నీటిమట్టం తగ్గుతూ వస్తుంది.ఆయకట్టుకు నీటిసరఫరాను సంబందిత అధికారులు విడుతల వారిగా కొనసాగిస్తున్నారు. అయితే ఆయకట్టుకు నీటిసరఫరా చేస్తుండటంతో ప్రాజెక్టు పరిదిలోని దేవరకద్ర, మరికల్, ధన్వాడ మండలాలకుచెందిన ఆయకట్టు రైతులు ముమ్మరంగా పంటలను పండించుకొంటున్నారు.

# పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

● దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంటేశ్వర్‌రెడ్డి



**మూసాపేట,మార్చి 18 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి సహాయనిధి నుండి వచ్చి రూ. 5,50,000ల విలువ గల ఎల్‌ఓసిని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లోని పంజాగుట్టలోని నిజాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ఆసుపత్రిలో మూసపేట మండల కేంద్రానికి చెందిన అరవింద్ తండ్రి కేశవులుకు చికిత్స నిమిత్తం రూ. 5,50,000 విలువ గల ఎల్‌ఓసి కాపీని బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.

## ఆకట్టుకున్న బాలల సభ



బాలల సభలో విద్యార్థినీ, విద్యార్థులు

**ఉట్కూర్,మార్చి 18 ప్రభాతవార్త:** రాష్ట్ర విద్యాశాఖ ఆదేశానుసారం ప్రతి మూడవ శనివారం నిర్వహిస్తున్న పేరెంట్స్ టీచర్స్ సమావేశం ఎంపియుపిఎస్ నిడుగుర్తి పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పాఠశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, మన ఊరు మనబడి పనుల తీరు అలాగే రాబోయే వార్షిక పరీక్షల దృష్ట్యా విద్యార్థుల సంసిద్ధతపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో చర్చించడం జరిగింది. అలాగే నేడు పాఠశాలలో విద్యార్థుల ఆట,పాటలతో బాలల సభ ఆహ్లాదకరంగా నిర్వహించడం జరిగింది. విద్యార్థులకు పాఠశాల వాతావరణం ఒత్తిడి రహితంగా ఉండాలనే ఉద్దేశంతో ఈరోజునో బ్యాగ్‌డే నిర్వహించుకోవడం జరుగుతుంద ని విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండాసంపూర్ణ వికాసం సాధించడం విద్యాలక్ష్యం అని అందుకు మా పాఠశాల ఉపాధ్యాయ బృందం అన్ని రకాలుగా కృషిచేస్తామన్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు లక్ష్మారెడ్డి, గ్రామ కార్యదర్శి జగన్‌మోహన్, చైర్మన్లు నర్సింహులు, మక్బుల్ ఖాన్,ఉపాధ్యాయులు పద్మ, సునిత, వెకటప్ప,సుజాత, సలాం, లియాఖత్, శ్రీనివాస్,ఆంజనేయులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్



**మూసాపేట,మార్చి 18 ప్రభాతవార్త:** మూసపేట మండల పరిధిలోని తుంకిల్‌పూర్ గ్రామం ప్రాథమిక పాఠశాలలో శనివారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం లక్ష్మణ్‌గౌడ్ మాట్లాడుతూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు ప్రతినెలలో 3వ శనివారం పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించాలనే నిబంధనల మేరకు ప్రాథమిక పాఠశాల తుంకినీపూర్‌లో పిటిఎం కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులసమక్షంలో విద్యార్థులచే పాఠాలుచదివించడం, లెక్కలు చేయించడం, హోంవర్క్‌లను చూడడం, గురుకులాలకు పోటీ పరీక్షలు రాసే విద్యార్థుల వివరాలు తెలియజేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మణ్, ఉప సర్పంచ్ శేఖర్, ఎస్‌ఎంసి ఛైర్మన్ రాములు, వైస్ ఛైర్మన్ సుజాత,పాఠశాల హెచ్‌ఎంలక్ష్మణ్‌గౌడ్, సహఉపాధ్యాయులు కుర్మయ్య తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## డా.బీ.ఆర్.అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టకు సర్వం సిద్ధం


● మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీ సాయి



అంబేద్కర్ పార్క్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్

**పెబ్బేరు,మార్చి 18 ప్రభాతవార్త:** పెబ్బేరు పురపాలక కేంద్రంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టకు సర్వం సిద్ధం చేసినట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎద్దుల కరుణ శ్రీ సాయి తెలిపారు. శనివారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సహకారంతో మున్సిపల్ పాలకవరనగం సమక్షంలో ఉమ్మడి జిల్లాలోనే ఎక్కడాలేని విధంగా అత్యంత సుందరంగా నిర్మితమైనటువంటి అంబేద్కర్ పార్క్ అంబేద్కర్ విగ్రహం ప్రతిష్టాపనకు సర్వం సిద్దమైందని ఆమె తెలిపారు.విగ్రహం ప్రతిష్టాపన మహోత్సవానికి అన్ని రకాలుగా సిద్దంగా ఉండాలని మున్సిపల్ అధికారులకు, కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలోమున్సిపల్ వైస్ ఛైర్మెన్ కర్రెస్వామి, ఏఈ రమేష్‌నాయుడు,మండల అంబేద్కర్ యువజన సంఘాల కన్వీనర్ శివ శంకర్, గోనెల సురేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

## అంతిమ సంస్కారాలకు ఎంపీపీ మేఘూరెడ్డి ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న నరేష్

**పెద్దమందడి,మార్చి 18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెల్టూరు గ్రామానికి చెందిన గండు శాంతమ్మ ఇటీవల అనారోగ్యానికి గురై శనివారం ఉదయం మృతి చెందింది. దండు శాంతమ్మ కుటుంబం అతి పేదరికంలో ఉండడంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. ఈ విషయాన్ని ఆ గ్రామ టీఎమ్ఆర్ యువసేన అధ్యక్షులు నరేష్ ఎంపీపీ మేఘూరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన తక్షణమే రూ.5వేలుపంపించారు. ఆనగదును శాంతమ్మ కుటుంబ సభ్యులకు నరేష్ అందజేశారు.ఈసందర్భంగా ఎంపీపీమేఘూరెడ్డిని మృతురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలుతెలిపారు.కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## శివాజి విగ్రహ ప్రతిష్టాపనకు వార్డు సభ్యురాలు విరాళం

**దేవరకద్ర,మార్చి 18 ప్రభాతవార్త:** దేవరకద్ర ఉమ్మడి మండలంలోని కౌకుంట్ల కొత్త మండల కేంద్రంలో శనివారం గ్రామంలో ప్రతిష్టించే ఛత్రపతి శివాజి విగ్రహ ప్రతిష్టాపనకు తనవంతు సహాయంగా స్థానిక వార్డు సభ్యురాలు జయలక్ష్మి రూ.25వేల విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కేబీఆర్ గౌడ్,మండల యువకులు,ఛత్రపతిశివాజి సంఘం నాయకులు పాల్గొన్నారు.



# టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నాపత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలి

■ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి,కృష్ణ, సబ్బిరెడ్డి వెంకటరెడ్డి



కలెక్టర్ కార్యాలయంలో మెమోరాండం అందిస్తున్న జిల్లా బీజేపీ నాయకులు

**వనపర్తి టౌన్,మార్చి 18 ప్రభాతవార్త:** టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నాపత్రాల లీకేజీ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి,కృష్ణ, సబ్బిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశ్నా పత్రాల లీకేజీ అంశం పై రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేయడం తప్పుడు చర్య అని నయీం కేసు, డ్రగ్స్ కేసు,డేటా చోరి సహా సిట్‌కు అప్పగించిన కేసులన్నీ నీరుగారిపోయాయని ఈ అంశంపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపిస్తేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఎంతైన ఉందని పేర్కొన్నారు. టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ పై స్పందించాల్సిన సీఎం ఎందుకు నోరు మెదపడం లేదని వారు ప్రశ్నించారు. తన కొడుకు నిర్వాకం వల్లే పేపర్ లీక్ అయ్యింది వాస్తవం కాదా అనిఅన్నారు.30లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగటమాడతారా అని అన్నారు. పేపర్ లీకేజీ పై సిట్ విచారణ ఓ ఫాల్స్, కేసీఆర్ సిట్ అంటే సిట్..స్టాండ్ అంటే స్టాండ్ అనడమే సిట్ పని అని విమర్శించారు. ప్రశ్నా పత్రాల లీకేజీ లపై న్యాయ విచారణ జరిపించాలని, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నిరసన దీక్ష చేస్తే పోలీసులు అరెస్టు చేయడం, టీఎస్‌పీఎస్‌సీ కార్యాలయం ముట్టడించిన బీజేవైఎం కార్యకర్తలపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి జైలుకు పంపించడం అన్యాయమని, నిరుద్యోగుల తరుపున పోరాడుతున్న యువమోర్చ కార్యకర్తలను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున నిరుద్యోగుల తరుపున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు టీఎస్‌పీఎస్‌సీ ప్రవ్నాపత్రాల కుంభకోణం పై సిట్టింగ్ జడ్చి చేత విచారణ జరిపించాలని కోరుతూ బీజేపీ జిల్లా శాక ఆధ్వర్యంలో కలెక్టర్ కి మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం, పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ జింకల కృష్ణయ్య, జిల్లా నాయకులు ఆర్.వెంకటేశ్వర్ రెడ్డి, విష్ణువర్దన్ రెడ్డి, బాశెట్టి శ్రీను, శివారెడ్డి,పెద్దిరాజు, చెన్నయ్య, అనుజ్ఞరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్, బోయెల్లరాము,సూగూరు రాములు,రాయన్న, రాజశేఖర్‌గౌడ్, ఓం ప్రకాస్ చారి,విజయ్, సునందన్‌గౌడ్,శివ కుమార్ ఇతరులు పాల్గొన్నారు.

# ఆంగ్ల మాధ్యమంలో అంగన్‌వాడీలు



అంగన్‌వాడీ స్కూల్లో ప్రీస్కూల్ మేళాను నిర్వహిస్తున్న దృశ్యం

**ఉట్కూర్,మార్చి 18 ప్రభాతవార్త:** ఎడవెల్లి అంగన్‌వాడి కేంద్రంలో ప్రీస్కూల్ మేళాను సూపర్‌వైజర్ గీత, అంగన్‌వాడి టీచర్లు చంద్రకళ, అన్నపూర్ణ, భాగ్యమ్మల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సూపర్‌వైజర్ గీత మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రంలో రెండున్నర సంవత్సరాలు ఉన్న పిల్లలను పంపించడం వల్ల వాళ్లకు పౌష్టికాహారం అందించడంతో పాటు, మానసికంగా, శారీరకంగా, ముఖ్యంగ ఆంగ్ల మాధ్యమంలో ఆంగ్ల అక్షరాలు, సృజనాత్మక విద్యతో అభివృద్ధి చెందే విధంగా అంగన్‌వాడి టీచర్లు కృషి చేస్తారని తల్లిదండ్రులకు అగాహన కల్పించడం జరిగిందన్నారు. చిన్నారులు, డిడబ్ల్యుఓ, సిడిపిఓ, సూపర్‌వైజర్, అంగన్‌వాటి టీచర్, ఆయా, సర్పంచ్, ఎంపిటిసి, వార్డుమెంబర్‌ల వేషధారణతో ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయుడుఫెరోజ్‌ఖాన్ మాట్లాడుతూ విద్యార్థులను అంగన్‌వాడి స్కూల్‌కు పంపించడం వలన, విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు,చదవడంలో బట్టికాకుండా, సృజనాత్మకత విద్యతో మానసింగా, శారీరకంగా బలంగా తయారవుతారు. తదుపరి పాఠశాలలో చేరే సమయానికి విద్యలో మెరుగైన ఫలితాలనుసాధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జి.శిరీష, పంచాయతీ సెక్రెటరీ శ్రీపత్, ఉపాధ్యాయులు అనిత, మంజుల, నరసమ్మ, గ్రామపెద్దలు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

# కిడ్స్ వరల్డ్ ప్లే స్కూల్‌లో స్వయం పరిపాలన దినోత్సవం

**వనపర్తి ప్రతినిధి,మార్చి18 ప్రభాతవార్త:** వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని మర్రికుంట లో గల కిడ్స్ వరల్డ్ ప్లే పాఠశాలలో శనివారం చిన్నారులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులే టీచర్స్‌గా తోటి విద్యార్థులకు విద్యా బోధన చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ గా అస్కని పూజిత, కలెక్టర్ గా సాయి తేజిని, డీఈఓగా యువాన్, ఎంఈఓ గా కౌశిక్, చిన్నారులు తమ బాధ్యతలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ రాధిక, ఉపాధ్యాయ సిబ్బంది శిరీష, విద్యార్థులకు మెమొంటోలు అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు.



స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న చిన్నారులు, ప్రిన్సిపల్ గా అస్కని పూజిత

# అధికారుల అక్రమ తొలగింపులు ఆపాలి..

**ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి : ఐకెపి వీఓఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు**



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఐకెపి వివోఏ ఉద్యోగుల సంఘం నాయకులు

**వనపర్తి టౌన్,మార్చి 18 ప్రభాతవార్త:** ఐకెపి వివోఏ లను ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఐకెపి వీఓఏ ఉద్యోగుల సంఘం జిల్లా అద్యక్షుడు మండ్ల రాజు, ఐకెపి వివోఏల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య అన్నారు. శనివారం జిల్లా కమిటీ తెలంగాణ ఐకెపి వివోఏ ల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 3వరోజు టోకెన్ సమ్మెలో భాగంగా మర్రికుంట పాలకేంద్రం దగ్గర వంటవార్పుతో సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఐకెపి వివోఏలను ఉద్యోగులలకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం రూ.26వేలు కల్పించాలని అన్నారు. రూ.10లక్షల సాధారణ భీమా ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించాలని ఆన్‌లైన్ పనులు రద్దు చేయాలని అన్నారు. ప్రభుత్వం నుండి ఐడి కార్డులు ఇవ్వాలని, యూనిఫామ్ ఇవ్వాలని,మహిళా సంఘాల సభ్యులకు రూ.5లక్షల భీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకు వీఎల్ఆర్ శ్రీనిధి,వీఎల్ఆర్ డబ్బులు ఇవ్వాలని తెలిపారు. అభయాసం డబ్బులు అందరికి తిరిగి ఇవ్వాలని అన్నారు. ప్రతి గ్రామ కమిటీకి సక్క భవనం నిర్మించాలని, ప్రతి వివో యొక్క డబుల్ బెడ్ రూమ్ మంజూరు చేయాలని, అధికారుల అక్రమ తొలగింపలు ఆపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే కాలంలో పెద్దఎత్తున పోరాటాలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.అనంతరం మర్రికుంట నుండి కలెక్టర్ ఆఫీస్ వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా నాయకులు నందిమల్ల రాములు, ఐకెపి వివోఏ ఉద్యోగ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ వివిధ మండలాల నాయకులుశాంతమ్మ, ఇంద్రావతి, ఈశ్వర్, రంగన్న, రాములు, శ్రీనివాసులు, రాజగౌడ్, సత్యనారాయ, బాలరాజు, సతీష్, ఆంజనేయులు, భరత్, రమేష్, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

## జెన్ ఆరోగ్య సమితి సమావేశం



ఆసుపత్రి సమావేశంలో పాల్గొన్న అధికారులు, సర్పంచ్

**వెల్దండ, మార్చి 18 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జెన్ ఆరోగ్య సమితి సమావేశాన్ని శుక్రవారం వైద్యురాలు డాక్టర్ స్వరూప అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ విజయ జైపాల్‌నాయక్, సర్పంచ్ భూపతిరెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యురాలు స్వరూప మాట్లాడుతూ ఆసుపత్రి డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించేవారని, రాష్ట్ర ప్రభుత్వం పేరు మార్పిడి చేసి జెన్ ఆరోగ్య సమితిగా మార్చిందన్నారు. జెన్ ఆరోగ్య కమిటీ చైర్మన్‌గా ఎంపీపీ విజయ జైపాల్‌నాయక్, వైస్ చైర్మన్‌గా డిప్యూటీ డీఎంహెచ్ఓ, సెక్రటరిగా మెడికల్ అధికారి స్వరూప, సభ్యులుగా సర్పంచ్ భూపతిరెడ్డి, ఎంపీటీసీలు, ఎంపీడీఓ, ఎంఈఓ, సీడీపీఓతో పాటు పలు శాఖలకు చెందిన వారు సభ్యులుగా ఉంటారన్నారు. అనంతరం సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేస్తున్నారని, ఆసుపత్రిపై ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా సిబ్బంది వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ శాంతిగోపాల్‌నాయక్, డీటీ శ్రీనివాసులు, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ మోహన్‌లాల్, ఎంపీటీసీ గుత్తి వెంకటయ్య, ఏపీఎం రాములునాయక్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## నూతన సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**వెల్దండ, మార్చి 18 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో రూ.5లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతగా సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొని రావాలన్నారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చుడమే తన ధ్యేయమన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు యాదగిరి, శంకర్, కృష్ణయ్య, లింగం, చందు, మట్ట రఘుతో పాటు తదితరులు ఉన్నారు.

## పిడుగుపడి మృతి చెందిన గొర్రెల కాపరి కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థిక చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**వనపర్తి టౌన్,మార్చి 18 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలోని పిడుగుపాటు కు గురై మృతి చెందిన చిట్యాల గ్రామానికి చెందిన గొర్రెల కాపరి వంగూరు లక్ష్మి కుటుంబానికి జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షుడు పెండెం కురుమూర్తి యాదవ్, జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మెన్ గట్టు యాదవ్, జిల్లా గొర్రెల సహకార సంఘం ఉపాధ్యక్షుడు చంద్రయ్య యాదవ్ ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థిక సహాయం చేశారు. శనివారం చిట్యాల గ్రామంలోని మృతురాలి నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులకు మనోధైర్యం ఇచ్చారు.అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి దృష్టికి పిడుగుపాటుకు గురైన బాధితురాలి కుటుంబానికి ప్రభుత్వం రూ.6లక్షల ఆర్థిక సహాయం త్వరగా మంజూరు కావడానికి కృషి చేస్తామని వారు తెలిపారు. వారి వెంట గ్రామ సర్పంచ్ బాను ప్రకాష్, గ్రామయాదవ సంఘం అధ్యక్షులు బాలీశ్వర్, డైరెక్టర్లు ముంత తిరుమల్, అప్పయిపల్లి మాజీ సర్పంచ్ విష్ణు యాదవ్, రిటైర్డ్ ఎస్సై ప్రకాష్ యాదవ్, కరుణాకర్, ఉసర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీవెంకటేశ్వరుని కల్యాణం

**కొత్తకోట,మార్చి 18 ప్రభాతవార్త:** మండల కేంద్ర సమీపంలోని శ్రీవెంకటగిరి క్షేత్రంలో శ్రీ స్వయంభు లక్ష్మీ కళ్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా వేద పండితులు నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో స్వామి వారికి పంచామృతాభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణం అనంతరం పల్లకి సేవ నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.




## మక్తల్‌లో వడగండ్ల వాన



**మక్తల్,మార్చి 18 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని పరిసర ప్రాంతాలలో వడగండ్ల వర్షం శనివారం భారీగా కురిసింది. వడగండ్లు పడడంతో ప్రజలు వడగండ్లను చూస్తూ తమ పిల్లలకు చూయించారు. వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది.మరీ ముఖ్యంగా రోడ్లపై వడగండ్లు కురవడంతో తెల్లగా పాలరాతి వలె రోడ్లన్ని కనిపించాయి.

## అకాల వర్షాలతో మామిడి రైతుల కష్టాలు



మామిడి పూతను తినేస్తున్న పురుగు



మామిడి రైతు మిద్దె శ్రీనివాసులు

**వీపనగండ్ల,మార్చి 18 ప్రభాతవార్త:** గత రెండు రోజులుగా అకాలంగా కురు స్తున్న వర్షాలకు మామిడి తోటలు పూత, పిందెలు, కాయలు వర్షాలకు దెబ్బతిని కిందపడి మామిడి రైతులకు నష్టాలకు తెచ్చింది. ఈ సీజన్‌లో ముందే మామిడి తోటలకు తెగులు వచ్చి దిగేబడి చాలా తక్కువగా ఉంది. తోటలను కౌలుకు తీసుకున్న రైతులు చాలా నష్టపోయే అవకాశం ఉన్నందున ప్రభుత్వ పరంగా రైతులను ఆదుకోవాలని మామిడి రైతులు కోరుతున్నారు. వీపన గండ్ల మండల కేంద్రానికి చెందిన మిద్దె శ్రీనువాసులు అనే రైతు 600 మామిడి చెట్లు గల 3తోటలను కౌలుకు తీసుకున్నారు. కానీ తెగుళ్ల సంభ వించి పూత సరిగ్గా రాక వచ్చిన అరకొర మామిడికాయలు కూడా అకాల వర్షానికి రాలిపోతున్నాయని మామిడి రైతు శ్రీనివాసులు వాపోయారు. ప్రభుత్వ పరంగా మాలాంటి మామిడి తోటలను కౌలుకు తీసుకొని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎఎస్ఐ శ్రీనివాసులు

**వెల్దండ, మార్చి 18 ప్రభాతవార్త:** సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని ఎఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొట్ర జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లోని యువత చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని, చెడు వ్యసానాలకు దూరంగా ఉంటూ ఉన్నత పౌరులుగా ఎదగాలన్నారు. పాఠశాల వయస్సులో మొబైల్ పోన్ అవసరమైన మేరకు మాత్రమే వినియోగించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది నవీన్; గోపి, రవీందర్, పాఠశాల సిబ్బంది అరుణ, తౌర్య, బాలోజీ, కిరణ్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

## లింగంపల్లిలో మారెమ్మ దేవత విగ్రహ ప్రతిష్టాపన




మారెమ్మవ్వ దర్శనం చేసుకుంటున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

**మక్తల్ రూరల్, మార్చి 18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో మారెమ్మవ్వ దేవత విగ్రహం ప్రతిష్టాపన, ధ్వజస్థంభ ప్రతిష్టాపన కార్యక్రమం కన్నుల పండువగా భక్తి శ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దేవాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పెదనద ఎత్తున పాల్గొన్నారు. ఎన్నో ఏళ్లుగా శిథిలావస్థలో ఉన్నగుడిని మళ్లీ పున: నిర్మించడంలో గ్రామస్తుల సహకారం ఎంతో ఉందని గ్రామ సర్పంచ్ సుజాత అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ సుజాత శివ లింగప్ప, ఎంపిటిసి లతా సీతారామారావ్, తెరాస పార్టీ అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ చిట్టెమ్మ నర్సింహులు గ్రామపెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ..

**లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి చెక్కు అందజేసిన ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి**



శేఖర్‌కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆల

**కొత్తకోట,మార్చి 18 ప్రభాతవార్త:** కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని కనిమేట గ్రామానికి చెందిన శేఖర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతునికి రూ.2లక్షల చెక్కు మంజూరు కాగా ఆ చెక్కును ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్ రెడ్డి లబ్దిదారుడి ఇంటికి వెళ్లి చెక్కు అందజేశారు. శేఖర్ బీఆర్ఎస్ సభ్యత్వం కలిగి ఉండడంతో మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మెన్ వామన్ గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మెన్ చెన్నకేశవ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వంశీధర్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మెన్ వాసుదేవ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షులు గినన్నే కొండారెడ్డి, మాజీ జడ్పీటీసీవిశేశ్వర్, ఉమ్మడిజిల్లాల అధ్యక్షుడు ప్రశాంత్, భీమ్ రెడ్డి, బాలకృష్ణ, అయ్యన్న,ఆకుల శ్రీను, చాపలభాస్కర్, బాలకృష్ణారెడ్డి, శశిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సుభాష్, రాము, మహేష్,వికాస్ తదితరులు పాల్గొన్నారు.